నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 20-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:87 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

గగనమ్ము నంటు రీతిన
నుగమును బెంపొందజేయు నుత్సాహముతో
ఖగవాహను దయతో-జరు
పగవలె నీ నాడు ధరణి బాలల దినమున్

(నవంబరు 20 ప్రపంచ బాలల దినం)

సెల్:9494481210

చురక

దోస్తేమిటో కుస్తేమిటో
దోబూచుల గానస్వరం
ఎవరెప్పుడు ఎటుంటరో
ఎందుకింకా మాటగరం
రాజకీయమంటేనే
రంకుబొంకు ఎవ్వారం
నమ్ముతారా కపటనీతి
నేతల ఈ కువ్వారం

-వేల్పుల నారాయణ
9440433475

పెద్ద చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

నంగారెడ్డి, నవంబర్ 19:అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితులకు హైడ్రా అండగా ఉంటుందని కమిషనర్ రంగనాథ్ భరోసా ఇచ్చారు. మంగళవారం అమీన్‌పూర్ పెద్ద చెరువును ఆయన పరిశీలించారు. అక్కడ ముంపు బాధితులు ఫిర్యాదులు, వినతుల మేరకు ఆయన సందర్శించారు. తమ భూములు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువులోని నీరు తూముల ద్వారా కిందకు వదలకపోవడంతో ఎగువున వున్న తమ నివాసాలు మునిగిపోయాయి అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి స్థానికులు తీసుకు వెళ్లారు.

చెరువు లోని నీరు తూముల ద్వారా కిందకు వదలకపోవడంతో ఎగువున వున్న తమ నివాసాలు మునిగిపోయాయి అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి ఫిర్యాదు చేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ నిపుణుల కమిటీ వేసి నివేదిక తెప్పించుకుని ప్రభుత్వానికి సమర్పిస్తామన్నతెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడ చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని అక్రమ కట్టడాలపై ఆరా

మాజీ ఎమ్మెల్యే కాటసాని భూపాల్ రెడ్డి అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో ఆయనకు చెందిన 20 ఎకరాల భూములపై దృష్టి సారించారు. దీనిపై హైడ్రా విచారణ చేపట్టనుంది.

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

వారం రోజుల కింద పటాన్‌చెరు, అమీన్ పూర్ పర్యటించిన నేపథ్యంలో అక్రమాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. విచారణ చేపట్టిన అనంతరం అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. చెరువులు, కుంటలు నాళాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో హైడ్రా కూల్చి వేస్తుందన్న భయంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎక్కడ తమ వంతు వస్తుందోనన్న భయంతో అక్రమార్కులకు భయపడుతున్నారు. హైడ్రా అధికారులు విచారణ జరిపిన అనంతరం నోటీసులు అందించి అనంతరం కూల్చివేతలకు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణలో ఢిల్లీ పరిస్థితి రావొద్దనే ఈవీ పాలసీ తెచ్చాం: మంత్రి పొన్నం

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడిందని.. హైదరాబాద్, తెలంగాణలో అలాంటి పరిస్థితి రావొద్దని ఈవీ పాలసీ తెచ్చామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో పొల్యూషన్ తగ్గించాలంటే ఈవీ వాహనాలను వాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ప్రజలకు పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృతంగా ప్రజలు వాడేలా ఈ పాలసీ ఉందని.. ఈవీ వాహనాలపై రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు 100 శాతం మినహాయింపు ఇస్తున్నామని మంత్రి చెప్పారు. వాయు కాలుష్యం రావొద్దంటే 15 సంవత్సరాలకు పైబడిన వాహనాలను ప్రజలు స్వచ్ఛందంగా స్క్రాప్ చేయాలని.. ఇప్పటికే రాష్ట్రంలో స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే లగచర్ల ఘటన ... విపక్షాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి ఆగ్రహం

-ఉక్కు మహిళ.. ఇందిరాగాంధీ
-దేశం కోసం ప్రాణాలు అర్పించారు
-దేశం కోసం తన జీవితం అంకితం చేశారు
-సమగ్రతకు, సమానాత్వానికి పరితపించారు
-నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారు
-అక్కడి అమాయకులను మాటలతో ప్రేరేపించారు
-ఇందిరా వర్ధంతి సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 19: రాజకీయ లబ్ధి కోసమే లగచర్ల ఘటనకు కారణమని, అక్కడ అమాయకులను రెచ్చగొట్టి అధికారులపై దాడులకు ప్రేరేపించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విపక్షాలపై విరుచుకుపడ్డారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో నేడు మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో లాగా రైతుల నుంచి బలవంతంగా భూములను ప్రజా ప్రభుత్వం లాక్కోవడం లేదన్నారు. రాష్ట్రంలో అసైన్ చేసిన 24 లక్షల ఎకరాల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పదివేల ఎకరాలకు పైబడి రైతుల నుంచి బలవంతంగా గుంజుకొని లే అవుట్ చేసి అమ్ముకున్న దుర్మార్గులు మీరు కాదా? అని ప్రశ్నించారు.

లగచర్లలో హింసను ప్రేరేపించి దాడులకు పురిగొల్పుతున్నది మీరు అంటూ బిఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. అభివృద్ధి జరగాలని ఆలోచన చేస్తున్నది సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. భూములు కోల్పోయే వారిని అన్ని రకాలు ఆదుకుంటామన్నారు భట్టి విక్రమార్క. అందరికీ నచ్చ చెప్పే పరిశ్రమలకు భూమి తీసుకుంటామన్నారు. కొద్దిమంది రాజకీయ నేతలు కుట్రలతో అమాయకులను రెచ్చగొడు తున్నారని విమర్శించారు.

దేశం కోసం ఇందిరాగాంధీ జీవితం అంకితం .

దేశం కోసమే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన జీవితాన్ని అంకితం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భారతదేశాన్ని అస్థిరపరచాలి, దేశాన్ని విభాజించాలి అనుకునేవాళ్లు ఇందిరా చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఇందిరా గాంధీ తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తు చేశారు.

20 సూత్రాలతో సమాజానికి పునాదులు

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, 20సూత్రాల అమలుతో సమసమాజానికి పునాదులు వేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విదేశీ విధానంలో ఔనత్యాన్ని తీసుకువచ్చి ప్రపంచంలో భారత్‌ను గొప్ప దేశంగా నిలబెట్టారని గుర్తు చేశారు. దేశం కోసం జాతి కోసం నిత్యం పరితపించిన ప్రజా నాయకురాలు ఇందిరా గాంధీ అన్నారు. దేశ సుస్థిరత కోసం ఆమె చివరి రక్తపు బొట్టు ఉపయోగపడుతుందని చాటి చెప్పిన ఉక్కు మహిళ అని అన్నారు.

పేదల్లో వెలుగులు నింపారు..

ఇందిరాగాంధీ భారతదేశంలో పుట్టడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని భట్టి అన్నారు. అనేక సంస్థలు తీసుకువచ్చి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని, అందుకే ఇందిరా గాంధీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం అభివృద్ధిలో అందరికీ సమానమైన అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు చెప్పామన్నారు. ఈ ఏడాది కాలంలో చేసి చూపిస్తున్నామని అన్నారు. ఇందిరా స్ఫూర్తితోనే రాహుల్ గాంధీ దేశంలో కులగణన సర్వే జరగాలని ఎన్నికల్లో చెప్పిన విధంగా కులగణన సర్వేను ప్రారంభించామని అన్నారు. రాష్ట్రంలో కులగణన నిబద్ధతతో, శాస్త్రీయంగా జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం తయారు చేసే ప్రణాళికలకు ఈ సర్వే దోహదపడుతోందన్నారు. కుల గణన సర్వే పూర్తి తర్వాత ప్రజా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో దేశానికి ఈ రాష్ట్రం రోల్ మోడల్ గా ఉండబోతుందని చెప్పారు.

ఇందిరమ్మ స్ఫూర్తితోనే మహిళలకు పథకాలు

ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలకు పథకాలు అందిస్తున్నామన్నారు భట్టి విక్రమార్క. అధికారంలోకి రాగానే మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఫ్రీ బస్సు కోసం నెలకు రూ. 400 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఆశయ స్ఫూర్తితో ముందుకెళ్తున్నామన్నారు భట్టి. గతం తెలియని వారే ఇందిరమ్మ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. దేశాభిమానం లేనివారే ఇందిరమ్మపై విమర్శలు చేస్తున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలను తృణపాయంగా వదిలేసిన గొప్ప చరిత్ర ఇందిరా ఫ్యామిలీదన్నారు.

బలహీన వర్గాల కోసమే సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్నామన్నారు భట్టి. రాష్ట్ర ప్రజలందరికీ వనరులు అందజేయడానికే సర్వేచేస్తున్నామన్నారు భట్టి. యావత్ భారతదేశం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు సమానంగా అందాలనేది సర్వే ఉద్దేశమన్నారు.

బీజేపీ నేతలు ఊహల్లో బతుకుతున్నారని.. దేశాన్ని విభజించి రాజకీయంగా లబ్ధి పొందే కుట్రపన్నుతున్నారని విమర్శించారు భట్టి. బీజేపీ చెప్పిన ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పేదల అకౌంట్లో 15 వేలు వేస్తామని మోసం చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత కాంగ్రెస్ దన్నారు. జాబ్ క్యాలెండర్, యూపీఎస్ సీ తరహాలో ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. వరంగల్ లో ఇందిరా శక్తిని చాటి చెబుతామన్నారు భట్టి.

రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ఖరారు

మాస్కో నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారయింది. ఈ విషయాన్ని రష్యా ప్రతినిధి వెల్లడించారు. పుతిన్ అతి త్వరలోనే భారత్ పర్యటిస్తారని అధికారిక ప్రకటన విడుదల చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆయన భారత్ కు రాబూనడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇదిలా వుండగా అణ్వాయుధాల వినియోగాన్ని అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై పుతిన్ సంతకం చేశారు. దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపైకి ప్రయోగించేందుకు ఉక్రెయిన్ కు అమెరికా అనుమతించిన వేళ పుతిన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాగా అణ్వాయుధాలు కలిగి ఉన్న దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే, దానిని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని కీలక దస్త్రంలో పుతిన్ పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ ఖచ్చితంగా అమలు జరిగే విధంగా ఆదేశాలు ఇవ్వండి

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను కలిసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రును మంగళవారం ఆయన కార్యాలయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ,ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కలిసిన అనేక ప్రజాహిత విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.

జిల్లాలో ఉన్న అనేక ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యం అందించటం లేదని వారికి తెలియజేశారు. ఆరోగ్యశ్రీ ఖచ్చితంగా అమలు జరిగే విధంగా ఆదేశాలు డిఎంహెచ్ఓ కి ఇవ్వాలని కోరారు , అనేక బస్తీలలో కొత్త అంగన్వాడీ లని ఏర్పాటు చేయడం కొరకు యుద్ధ ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోవాలని కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న విషయాన్ని వారి దృష్టికి తీసుకువచ్చారు.

బలహీన వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన జిల్లాలో అమలు నత్తనడక నడుస్తోందని అధికారులు శ్రద్ధ చూపకపోవడం ని వారి దృష్టికి తీసుకువచ్చారు . ప్రభుత్వం చాలా గొప్పగా చెప్తున్నా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా జరగాలని. ఇండ్ల మంజూరు కాకముందే కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దరఖాస్తులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు అన్నిక్రాంతమవుతున్న పట్టించుకునే నాధుడు లేడని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత

సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బి;: రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో రాష్ట్రంలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవడం ఇదే మొదటిసారి. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 10 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో 12.4 డిగ్రీలు, బీహెచ్ఈఎల్‌లో 12.8 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లిలో 11.4 డిగ్రీలు, దక్షిణ హైదరాబాద్‌లో 13 నుంచి 15 డిగ్రీలు, కోర్ సిటీలో 17 నుంచి 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న ఎనిమిది రోజులు వాతావరణం ఇలాగే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన జీశాట్-20



న్యూఢిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్); భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో (ఎాఖీూ) రూపొందించిన అత్యాధునిక సమాచార ఉపగ్రహం జీశాట్-20 (ఊాయి 20) విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. అమెరికా ఫోరిడాలోని కేప్ కెనవెరాల్ ప్రయోగ కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. 34 నిమిషాల పాటు ప్రయాణించిన అనంతరం ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టింది. కొద్ది రోజుల్లో కర్ణాటలోని హసన్‌లో ఉన్న ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ సెంటర్ ఈ ఉపగ్రహాన్ని నియంత్రణలోకి తీసుకుంటుంది.వాణిజ్య పరంగా స్పేస్‌ఎక్స్, ఇస్రో మధ్య ఇదే తొలి ప్రయోగం కావడం విశేషం. 4,700 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని ఇస్రో వద్ద ఉన్న రాకెట్లు తీసుకెళ్లేందుకు సాధ్యం కాకపోవడంతో టెస్లా సీఈవో ఎలాన్ మాస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ సహకారం తీసుకున్నది. ఇది 14 ఏండ్ల పాటు సేవలు అందిం చన ుంది. అండమాన్ నికోబార్, లక్షద్వీప్ తో పాటు భారత్ మొత్తాన్ని కవర్ చేసి బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తు ంది. అదేవిధంగా విమానాల్లో వై-ఫై సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఆధునిక కా బ్యాండ్ ఫ్రీక్వెన్సీని మాత్రమే ఉపయోగించే ఉపగ్రహాన్ని ఇస్రో రూపొందించడం ఇదే మొదటి సారి. కాగా, జీశాట్-20 ఉపగ్రహం 14 ఏండ్ల పాటు సేవలు అందించ నుందని, భూకేంద్రంలోని మౌలికసౌకర్యాలు శాటిలైట్‌తో అనుసంధానం కానుందని ఇస్రో చీఫ్ సోమనాథ్ అన్నారు. బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ నుం చి ప్రయో గాన్ని ఆయన పర్యవేక్షిం చా రు. అనంతరం మాట్లాడుతూ.. కచ్చిత మైన కక్షలోకి ఉపగ్రహం చేరడంతో ప్రయో గం విజయవం తమైంది. ఉపగ్రహంలో ఎటువంటి సమస్యలు లేవు.. సోలార్ ప్యానెల్లు అమర్చామని చెప్పారు.

21న నగరానికి రాష్ట్రపతి.. కోటి దీపోత్సవంలో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

హైదరాబాద్, నవంబర్ 19:ఈ నెల 21న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు రానున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నారు. అందులో భాగంగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అక్కడ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్, ఆర్ అండ్ బీ, అగ్ని మాపక శాఖ, విద్యుత్ శాఖ, వైద్యారోగ్య శాఖ, జీహెచ్ఎంసీతో నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో రాష్ట్రపతి భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్‌తో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి పర్యటన దృష్ట్యా ఎక్కడ కూడా పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా ఏర్పాట్లలో పాల్గొనే అధికారుల జాబితాను తమకు అందించాలని కోరారు. అగ్ని మాపక శాఖ పాత్ర కీలకమని అధికారులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. నిరంతరం ఫైర్ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ద్వారా పారిశుద్ధ్య పనులు నిరంతరం జరగాలని సూచించారు. స్ట్రీట్ లైటింగ్, లూస్ వైర్లు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఐదు మెడికల్ స్టాల్స్‌తో పాటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా స్టేజ్ ఏర్పాటుపై ఆర్ అండ్ బీ శాఖ ధృవీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంటకాచారి, ఆర్డీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

శబరిమలకు భారీగా అయ్యప్ప భక్తులు..

హైదరాబాద్, నవంబర్ 19:శబరిమలకు అయ్యప్ప భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. పెద్ద సంఖ్యలో మాలధారులు రావడంతో స్వామివారి దర్శనానికి 10 గంటల సమయం పడుతున్నది. సన్నిధానం నుంచి పంబ వరకు అయ్యప్ప భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మండల పూజ ప్రారంభం కావడంతో శబరిమలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ట్రావెన్‌కోర్ ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తున్నది.

ఇప్పటికే అయ్యప్ప దర్శనాల కోసం టైమ్ స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేసిన దేవస్థానం కమిటీ.. దర్శన సమయాన్ని 18 గంటలకు పొడిగించింది. అదేవిధంగా వర్చువల్ క్యూ బుకింగ్స్‌ను ప్రారంభించింది. వర్చువల్ దర్శనానికి తొలిరోజే 30వేల మంది భక్తులు టికెట్స్ బుక్ చేసుకున్నారు. ఈ ఏడాది నిత్యం 80 వేల మందికి దర్శనాలు కల్పిం చాలని నిర్ణయించారు.

హెచ్ యు జె (టిడబ్ల్యూ జే ఎఫ్) సభ్యత్వ నమోదు ప్రారంభం

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ రి.నెం బి 2794(టిడబ్ల్యూ జే ఎఫ్ అనుబంధం) సభ్యత్వ నమోదు కార్యక్రమం నేడు రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమయింది. ఈ కార్యక్రమానికి టిడబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్ యు జే అధ్యక్షుడు బి.అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు హెచ్ యు జే సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, టిడబ్ల్యూ జే ఎఫ్ అనుబంధ సంఘంగా కొనసాగుతున్న హెచ్ యు జే చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టిడబ్ల్యూ జే ఎఫ్, హెచ్ యు జే నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పనిచేసే సంఘం హెచ్ యు జే మాత్రమేనని సోమయ్య అన్నారు. హెచ్ యు జే అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక హెచ్ యు జే కు జర్నలిస్టుల మద్దతు సంపూర్ణంగా ఉన్నదని చెప్పారు. టిడబ్ల్యూ జే ఎఫ్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, మాట్లాడుతూ హెచ్ యు జే టీం కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల్లో విశ్వాసం నింపేలా హెచ్ యు జే పని చేయాలని టిడబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ అకాంక్షించారు.టిడబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిరాధిక మాట్లాడుతూ, సంఘంలో మహిళా ప్రాధాన్యం పెరగాల్సి ఉందనీ, ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తొలి సభ్యత్వాన్ని ఫెడరేషన్ అధ్యక్షుడు సోమయ్యకు హెచ్ యు జే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్, బి జగదీష్ లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ యు జే నాయకులు రాజశేఖర్. నవీన్, పద్మరాజు, నాగవాణి, ప్రశాంత్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల విష వలయంతో విశ్వబాలలు

(20 నవంబర్ "ప్రపంచ బాలల దినోత్సవం" సందర్భంగా)

నేటి బాలలే రేపటి భావి ప్రపంచ పౌరులు. బాల్యం ఆనందాలకు చిరునామా. బాల్యం సున్నితం, బహు సుందరం. బాల్యం అద్వితీయ అనుభవాల నెలవు. అందరం బాల్యదశ నుండి ఎదిగిన వారమే. కుటుంబ సంతోషాలకు ప్రేరణ చిరునవ్వుల చిన్నారులు. పిల్లలకు ప్రశ్నించడం, తెలుసు కోవాలనే తపన ఉండడం గమనిస్తుంటాం. సమాజంలో ఒక ప్రధాన భాగమైన బాలల భవితను సన్మార్గంలో నిర్మించాల్సిన కనీస బాధ్యత నేటి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజంపై ఉన్నది. పిల్లలకు మానవ హక్కులు ఉంటాయని, వాటిని అమలు చేయాలని, అవగాహన కల్పించాలని, చర్చించి తగు సమాధానాలు వెతకాలని, బంగారు బాటలు వేయాలనే పలు సదుద్దేశాలతో ప్రతి ఏట యూనిసెఫ్ నాయకత్వంలో 20 నవంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు "ప్రపంచ బాలల దినోత్సం(వరల్డ్ చిల్డ్రన్స్ డే)" ఘనంగా నిర్వహించడం 1990 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో ప్రతి నవంబర్ 14న జాతీయ బాలల దినాన్ని, 01 జూన్‌న అంతర్జాతీయ బాలల దినం కూడా పాటిస్తున్నామని మనందరికీ తెలుసు. పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు, లలిత కళల పట్ల ఆసక్తిని గమనించి శిక్షణను ఇవ్వడానికి పెద్దలు చొరవ చూపాలి.

ప్రపంచ బాలల ప్రధాన సమస్యలు:

ప్రపంచ బాలల హక్కులను నిర్లక్ష్యం చేయడం, అపార్థం చేసుకోవడం, కాలరాయడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేటి బాలల సంక్షేమ చర్యలే రేపటి ప్రపంచ ఉజ్వల భవితకు రాచబాటలు మరిచిపోతున్నాం. ఆధునిక ప్రపంచ బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేదరికం, ఆకలి కేకలు, పోషకాహారలోపాలు, అవిద్య, సామాజిక మాద్యమాల దురలవాటు, సహచరుల ఒత్తిడి, స్క్రీన్ టైమ్ అవలక్షణాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, చదువుల ఒత్తిడి, స్థూలకాయం, శారీరక ఎదుగుదల లోపించడం, అనవసర ఆందోళనలు, భావోద్వేగ సవాళ్లు, లైంగిక వేధింపులు, సురక్షిత నీటి కొరత, బాల కార్మిక అవస్థలు, లింగ-ఆధార హింస, యుద్ధ దేశాల్లో దుష్ప్రభావాలు, వలసల దుఃఖాలు, గృహ వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాతావరణ మార్పులతో అనారోగ్యాలు, కాలుష్య ప్రతికూలతలు, కుటుంబ సమస్యలు, అక్రమ రవాణాలు, జాతి వివక్షలు, మానసిక సమస్యలు లాంటివి గుర్తించబడినవి.

బాలల హక్కులకు పట్టం కడదాం:

విశ్వ బాలల హక్కులు ఎలాంటి చర్చలను తావులేనివి. బాలల హక్కులను కావరాయడం అంటే రేపటి వారి ఉజ్వల భవిష్యత్తును పాతరేయడమే. నేడు, రేపు, భవిష్యత్తులో సదా ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలంటే బాలల పెంపకంలో అతి శ్రద్ధ అనివార్యం. పిల్లల ఆలోచనలు విందాం. వారిలో దాగిన సృజనను ప్రోత్సహిద్దాం. వారి అనుమానాలను ఓపికగా నివృత్తి చేద్దాం. వారి సున్నిత మనసులను ఆప్యాయంగా ఆదరిద్దాం. తల్లితండ్రుల జీవన సాఫల్యత వారి పిల్లల ఎదుగుదల ప్రమాణాలపై మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకుందాం. నేటి ప్రపంచ బాలల దినోత్సవం-2024 థీమ్ "ప్రతి పిల్లాడికి మౌళిక హక్కులు ఉన్నాయి(ఫర్ ఎవ్రీ చైల్డ్, ఎవ్రీ రైట్)" ఆధారంగా సకల సౌకర్యాలను కల్పిస్తూ చిరు మొక్క వలె పంచుదాం, మహా వృక్షంగా ఎదిగి మరి కొందరికి నీడనిచ్చే స్థాయికి చేర్చుదాం. చిచ్చర పిడుగుల్లో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలను పెంచుదాం. సృజనకు పట్టం కడదాం. కలలను సాకారం చేసుకునే విధంగా సౌకర్యాలను కల్పిద్దాం.

పసి పిల్లలు తోటలో మొగ్గల్లాంటి వారని, వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తే పరిమళ సుగంధ పుష్పాలుగా వికసిస్తారని గుర్తుంచుకుందాం. బాల్యాన్ని చిదిమేయడం అంటే రేపటి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే. కుటుంబం విచ్ఛిన్నమైతే విశ్వం వల్లకాడు అవుతుంది. మన బాలల్ని మనసారా ప్రేమించడం అంటే వారి పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించడమే. నేటి ప్రపంచ బాలల్ని రేపటి విశ్వ నాయకుల స్థాయికి చేర్చడానికి మనందరం నిచ్చెనగా నిలబడదాం, తడబడినపుడు ఊతకర్రగా నిలుద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్

– వింతశబ్దకాలుష్యం కలిగించే 25సైలెన్సర్లు తొలగింపు
– ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మం, నవంబర్ 19 (నేటినిజం ప్రతినిధి) : ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో మంగళ వారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చారు. ఇటీవల కాలంలో కొందరు యువత ద్విచక్ర వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చుచేసి.. అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని, దీని వల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడడంతో పాటు..ప్రజలు భయభ్రంతులు కలిగేలా రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. మరి కొందరు వాహనాల హారన్లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని, అటువంటి వారి ఆట కట్టించేందుకు ట్రాఫిక్ పోలీసు దృష్టి సారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైందని అన్నారు. మంగళవారం 25మోడిఫైడ్ సైలెన్సర్ల వరకూ తొలగించి ఒక్కో వాహనదారుడికి రూ.1,000 జరిమానా విధించారమని, ఇకపై ధ్వని కాలుష్యాన్ని కల్గించే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ముందుగా సంబంధిత వాహనానికి ఉన్న మోడిఫైడ్ సైలెన్సర్ను తొలగించి, జరిమానా వేసి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తొలగించిన సైలెన్సర్ల స్థానంలో ఆ సంస్థ ఇచ్చిన పొగగొట్టాలని అమర్చాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డ్రైవ్ లు ఇంకా కొనసాగుతాయని నిబంధనలు అతిక్రమించి తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. అదేవిధంగా లైసెన్సు, నంబర్ ప్లేట్ నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ మోహన్ బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సై రవి, సాగర్, వెంకన్న, రాము పాల్గొన్నారు.

శ్రీ గిరిధర్ మాలవీయ మృతి పట్ల సంతాపం తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 19భారత రత్న, 'మహామాన' పండిత్ మదన్ మోహన్ మాలవీయ ముని మనవడు శ్రీ గిరిధర్ మాలవీయ మృతి పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. శ్రీ గిరిధర్ మాలవీయ గంగా నది ప్రక్షాళన కోసం చేసిన అవిరళ కృషి, విద్యా రంగ సమున్నతి కోసం అందించిన తోడ్పాటును ప్రధాని గుర్తు చేసుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ప్రధాని ఈ సందేశాన్ని పోస్ట్ చేశారు:

''భారత రత్న, మహామాన పండిత్ మదన్ మోహన్ మాలవీయ ముని మనవడు శ్రీ గిరిధర్ మాలవీయ మృతి నన్ను కలిచి వేసింది. వారి మృతి కేవలం విద్యా రంగానికే కాదు, మొత్తం దేశానికే తీరని లోటు. గంగా ప్రక్షాళన ఉద్యమంలో వారి పాత్ర మరువలేనిది. న్యాయ రంగంలో సైతం ఆయన తనదైన పంథాలో సేవలు అందించి విలక్షణ గుర్తింపు పొందారు. గతంలో శ్రీ గిరిధర్ మాలవీయను నేరుగా కలుసుకునే చక్కని అవకాశం నాకు లభించింది.

ప్రజా పాలన కళాయాత్ర ప్రారంభం

-జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాహుల్
-రాజ్‌డిసెంబర్ -7 దాకా కొనసాగనున్న కళాయాత్ర ఉత్సవాలు

మెదక్, నవంబర్ 19: ప్రజా పాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో వాహనాన్ని ప్రత్యేకంగా ఫ్లెక్సీ బ్యానర్ల తో సిద్ధం చేయగా, కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ప్రజా విజయోత్సవాలు ఈ నెల 19-11-2024 నుంచి డిసెంబర్ 07-12-2024 జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలు, 21 మండలాల్లోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై ప్రచారం చేయనున్నారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో, ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కళాయాత్ర మెదక్ జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, ప్రజల జీవన విధానాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలలో తీసుకువెళ్లడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ద్వారా ఒక కోటి 62 లక్షల మంది మహిళలు బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం పొందగా, 53 కోట్ల 24 లక్షల రూపాయలు లబ్ది చేకూరిందన్నారుగృహ జ్యోతి కార్యక్రమం ద్వారా 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 01 లక్ష 25 వేల 737 మంది వినియోగదారులకు చేయడం జరిగింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 31 కోట్ల 36 లక్షల సబ్సిడీ అందజేసింది.రైతు రుణమాఫీ, ఎంప్లాయిమెంట్ కార్డు, ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. 4359 మహిళా స్వయం సహాయక సంఘాలకు సుమారు 354 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని, స్త్రీ నిధి ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల రూపాయల రుణం, మైక్రో ఎంటర్ప్రైజెస్ లను 51 కోట్ల 20 లక్షలు రూపాయల వ్యయంతో పూర్తి చేయబడినవి.

'ఆకలికి, పేదరికానికి వ్యతిరేకంగా పోరాటం, సామాజిక సన్నిహితత్వం' అనే అంశాలు ప్రధానంగా జి 20 కార్యక్రమం

న్యూఢిల్లీ, నవంబర్ 19'ఆకలికి, పేదరికానికి వ్యతిరేకంగా పోరాటం, సామాజిక సన్నిహితత్వం' అంశాలు ప్రధానంగా ఈ రోజున నిర్వహించిన జి 20 శిఖరాగ్ర సమావేశ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యాన్ని ఇస్తున్నందుకు, అతిథి మర్యాదలు చక్కని పద్ధతిలో చేస్తున్నందుకు బ్రెజిల్ అధ్యక్షుడు శ్రీ లూయిస్ ఇనాషియో లూలా డిసిల్వాకు ప్రధాని ధన్యవాదాలు తెలియజేశారు. బ్రెజిల్ లో నిర్వహిస్తున్న జి 20 కార్యక్రమాలు స్థిరాభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారిస్తుండడం ప్రశంసనీయమని ప్రధాని అన్నారు. ఈ వైఖరి అభివృద్ధి చెందుతున్న దేశాలకున్న ఆందోళనలపై శ్రద్ధ వహిస్తూ, న్యూఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమావేశంలో ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ చేసిన నిర్ణయాలను మరింత ముందుకు తీసుకుపోతోందని ఆయన అన్నారు. జి 20 కూటమికి భారతదేశం అధ్యక్షత వహించిన కాలంలో, "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు" అంటూ ఇచ్చిన పిలుపు రియో చర్చల్లో కనిపిస్తోందని ఆయన అన్నారు.

ఆకలి, పేదరికం.. వీటిని పరిష్కరించడానికి భారతదేశం చేపట్టిన కార్యక్రమాలను ప్రధానమంత్రి వివరిస్తూ, భారతదేశం గత పది సంవత్సరాలలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తెచ్చిందని, దేశంలో 80 కోట్ల మంది ప్రజలకు ఆహారధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వచ్చిందన్నారు. ఆహార భద్రతను కల్పించడంలో భారతదేశం సాధించిన సాఫల్యాల గురించి ప్రధాని చెబుతూ.. భారత్ అనుసరించిన విధానం 'మూలాల్లోకి తిరిగి వెళ్లడంతో పాటు, భవిష్యత్తుకేసి సాగిపోవడం' అనే అంశాలపై ఆధారపడిందని అన్నారు. మహిళలకు ప్రధాన భూమికను అప్పగిస్తూ అభివృద్ధిని సాధించడానికి భారతదేశం తీసుకొన్న చర్యలను సైతం సభకు ఆయన వివరించారు.

ఆఫ్రికాలోనూ, ఇతర దేశాల్లోనూ ఆహార భద్రతను పెంచడానికి భారతదేశం తీసుకొన్న చర్యలను కూడా ప్రధానమంత్రి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన, ఆకలికి, పేదరికానికి వ్యతిరేకంగా పోరాడడానికి ఒక భౌగోళిక కూటమిని ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్ నడుం బిగించడాన్ని స్వాగతించారు. ప్రస్తుతం ప్రపంచంలో పలు ప్రాంతాలలో పోరాటాలు కొనసాగుతున్న నేపథ్యంలో తలెత్తిన ఆహార, ఇంధన, ఎరువుల సంబంధిత సంక్షోభాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపైన తీవ్ర ప్రభావాన్ని కలుగజేశాయి. ఈ కారణంగా ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యాన్ని ఇవ్వడం తప్పనిసరి అని ప్రధాని అన్నారు.

విజయప్రస్థానంలో మరో మెట్టును చేరుకొన్న వయ్ వందన కార్డులు దేశంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో నవోదయం

న్యూఢిల్లీ, నవంబర్ 19ధన్వంతరి జయంతి, ఆయుర్వేద దినోత్సవం.. ఈ రెండిటినీ కూడా ఈ సంవత్సరంలో అక్టోబరు 29నే జరుపుకోవాల్సివచ్చింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సుమారు రూ.12,850 కోట్ల విలువైన ఆరోగ్య సంరక్షణ సంబంధిత పథకాలను న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ)లో ఈ ఏడాది అక్టోబరు 29న ప్రారంభించారు. 70 ఏళ్ల వయసు, అంతకు మించిన వయసు కలిగిన పౌరులందరూ ఆసుపత్రులలో చికిత్సను ఉచితంగా పొందవచ్చని ప్రధాని ఈ సందర్భంగా ప్రకటించారు. ఇది ఆరోగ్యసంరక్షణ లో ఒక పెనుమార్పును తీసుకువచ్చే నిర్ణయం. ఈ వయసున్న వృద్ధులకు ఆయుష్మాన్ వయ్ వందన కార్డులను ఇవ్వనున్నారు. దీంతో, వారికి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎమ్-జేఏవై) పథకంలో భాగంగా ఆరోగ్యసంరక్షణపరంగా విస్తృత లాభాలను అందుకొనే అవకాశం అందిరానుంది. ఈ కార్యక్రమంలో ఇప్పటికే చాలా మంది చేరారు; 10 లక్షలకు పైగా సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ వయ్ వందన కార్డులను తీసుకోవడానికి వారి పేర్లను నమోదు చేయించుకొన్నారు. అంటే ఈ పథకంలో భాగంగా అందించే ఉచిత చికిత్సను, ఇతరత్రా సాయాన్ని అందుకోవడానికి వారు సిద్ధమయ్యారన్నమాటే.

వయ్ వందన కార్డు కు ఆయుష్మాన్ భారత్ పీఎమ్ జేఏవై కార్యక్రమంలో ఒక ముఖ్య పాత్ర ఉంది. ఇది ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనకు ఊతాన్ని అందించే కార్యక్రమం. "ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎమ్-జేఏవై)''ని 2018 సెప్టెంబరు 23న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం అందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలని భారత్ తీసుకున్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నది. ఈ పథకం జనాభాలో అత్యంత బలహీన వర్గాల వారికి చెప్పుకోదగిన మేరకు ఆరోగ్య సేవలను అందించడానికి ఉద్దేశించింది. ఇది మరింత విస్తృత పరిధిని కలిగి ఉన్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో ఒక భాగం. అంతేకాకుండా, ఆరోగ్య సంరక్షణ రంగంలో దేశం అనుసరిస్తూ వచ్చిన విధానానికి ఇది సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ప్రపంచంలో అతి పెద్దదైన ఆరోగ్య హామీ పథకం అనే ఖ్యాతి పీఎమ్-జేఏవైకి దక్కింది. మన దేశ జనాభాలో కింది స్థాయిలో ఉన్న 40 శాతం మంది ప్రజలలో సుమారు 55 కోట్ల మందికి ప్రతి ఏటా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు రెండో అంచె, మూడో అంచె ఆసుపత్రులలో చేరితే అయ్యే ఖర్చులకు సంబంధించిన ప్రయోజనాలను ఈ పథకం అందిస్తున్నది. ఈ పథకంలో కుటుంబాలను సోషియో-ఎకనామిక్ కాస్ట్ సెన్సస్ 2011 (ఎస్ఈసీసీ 2011)లో పేర్కొన్న వృత్తుల ప్రమాణాల, సమాజంలో నిరాదరణకు పాలైన వర్గాల ఆధారంగా నమోదు చేసుకొన్నారు.

ఇంతకు ముందు అమలైన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బీవై) లో కుటుంబంలో ఐదుగురు సభ్యులకు ప్రయోజనాలు పరిమితమైతే దానికి భిన్నంగా, పీఎమ్-జేఏవైలో కుటుంబ సభ్యుల విషయంలో గానీ, లేదా వయస్సు పరంగా గానీ ఎలాంటి పరిమితిని విధించ లేదు. అంతే కాదు, దీనిలో లబ్ధిదారుకు ముందే ఉన్న వ్యాధుల విషయంలో రక్షణ అనేది ఈ పథకంలో చేరిన మొదటి రోజు నుంచే లభిస్తున్నది. దీనితో రోగులు ఈ పథకంలో చేరిన వెనువెంటనే, చికిత్సను చేయించుకొనేందుకు వీలు ఉంటుంది.

పీఎమ్-జేఏవై పరిధిని గణనీయంగా విస్తరించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రిమండలి ఈ ఏడాది సెప్టెంబరు 11న ఆమోదం తెలిపింది. 70 ఏళ్ళ వయసు, అంతకు మించిన వయసున్న సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా రక్షణలో పెద్ద మార్పునకు ఈ ఆమోదం వాగ్దానం చేస్తోంది. ఈ చర్య 4.5 కోట్ల కుటుంబాలలో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ప్రయోజనాలను అందించడానికి ఉద్దేశించింది. ఈ విస్తరణలో భాగంగా, 70 ఏళ్ళు, అంతకు మించిన వయసు కలిగిన సీనియర్ సిటిజన్లు అందరికీ ఏబీ పీఎమ్-జేఏవై ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకు రావడానికి ఒక కొత్త ప్రత్యేక కార్డును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ వాగ్దానాన్ని "వయ్ వందన కార్డు"ను ప్రారంభించి, అతి త్వరగా నెరవేర్చారు. ఈ వయ్ వందన కార్డు అర్హులైన సీనియర్ సిటిజన్ లకు ఆసుపత్రిలో ఉచితంగా ఆరోగ్య చికిత్స సదుపాయాన్ని కలగజేయనున్నది. ఈ కార్డు సార్వజనికమైంది. దీని విషయంలో పేదవారికైనా, మధ్యతరగతికి చెందిన వారికైనా లేదా ఉన్నత తరగతికి చెందినవారికైనా ఎలాంటి ఆదాయ పరిమితీ లేదు. కుటుంబంలోని వయోవృద్ధులకు వారి జేబులో నుంచి పెట్టుకొనే ఖర్చులను చాలా వరకు తగ్గించాలనే లక్ష్యాన్ని ఈ వయ్ వందన కార్డు నెరవేర్చనుంది.

ఒక మహత్తర విషయం ఏమిటి అంటే, 70 ఏళ్లు, అంతకు పైబడిన వయస్సు కలిగిన వరిష్ఠ పౌరులు 10 లక్షల మందికి పైగా కొత్తగా ప్రారంభించిన ఆయుష్మాన్ వయ్ వందన కార్డు పథకంలో వారి పేర్లను నమోదు చేసుకొన్నారు. దీంతో వారు ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎమ్-జేఏవై) పథకంలో భాగంగా ఉచితంగా అందే ఆరోగ్యసంరక్షణ ప్రయోజనాలను అందుకోవడానికి అవకాశం లభిస్తుంది. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ ఏడాదిలో అక్టోబరు 29న ఈ కార్డును అమలులోకి తీసుకురావడాన్ని ప్రారంభించిన మూడు వారాల లోపే ఈ పని పూర్తి అయింది. దాదాపు 4 లక్షల మంది మహిళలు వారి పేర్లను ఆయుష్మాన్ వయ్ వందన కార్డు పథకంలో నమోదు చేయించుకొన్నారు. ఆయుష్మాన్ వయ్ వందన కార్డు ను ప్రారంభించినప్పటి నుంచి, రూ.9 కోట్లకు పైగా విలువ కలిగిన చికిత్సలకు అధికారిక ఆమోదాన్ని ఇవ్వగా, 70 ఏళ్లు, అంతకు పైబడిన వయస్సు కలిగిన వరిష్ఠ పౌరులు 4,800 మందికి పైగా ఈ పథకం ప్రయోజనాలను పొందారు. వీరిలో 1,400 మందికి పైగా మహిళలున్నారు. ఈ చికిత్సలలో కరోనరి ఏంజియోప్లాస్టీ, విరిగిన తొడ ఎముకలు/ప్రత్యామ్నాయాన్ని అమర్చడం, పిత్తాశయాన్ని తొలగించడం, శుక్లాలకు శస్త్రచికిత్స చేయడం, ప్రొస్టేట్ రీసెక్షన్, స్ట్రోక్ తదితరాలు భాగంగా ఉన్నాయి.

భారతదేశం ప్రగతి పథంలో మునుముందుకు సాగిపోతున్న క్రమంలో, ప్రజలందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంతో పాటు పెద్ద వయసు వారికి సాయాన్ని అందించి వారు ఆత్మగౌరవంతో జీవించేటట్టు చూడాలన్న విషయంలో ప్రభుత్వం చాటుకొంటున్న అంకితభావాన్ని ఆయుష్మాన్ వయ్ వందన కార్డ్ వంటి కార్యక్రమాలు దృఢపరుస్తున్నాయి. పౌరులకు సమగ్ర ఆరోగ్య సంరక్షక సేవలు తక్కువ ఖర్చులో అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం వహిస్తున్న శ్రద్ధ దేశ ఆరోగ్య రంగంలో ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడం లోనూ, ప్రపంచమంతటా సార్వజనిక ఆరోగ్య సంరక్షణకు ఒక నమూనాను ఇవ్వాలన్న అంశంలోనూ పీఎమ్-జేఏవై పాత్రను కీలకంగా మార్చేసింది.

సాగునీటి ప్రాజెక్టులపై గత సర్కారు నిర్లక్ష్యం..అసెంబ్లీలో సభ్యులు గరం గరం

అమరావతి, నవంబర్ 19:నీటిపారుదల ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆసక్తికర చర్చ జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పోలవరం విధ్వంసం సహా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వీర్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సర్కార్ నీటిపారుదల ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. అనంతపురం, చిత్తూరుతోపాటు రాయలసీమ జిల్లాలకు ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీరని ద్రోహం చేశారని ఆయన ధ్వజమెత్తారు.

తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాలు ఆధారంగా ఏర్పడిందని, అలాంటి నీళ్లు ఏపీ సాధించుకోవడంలో గత టీడీపీ ప్రభుత్వం కృషి ఎంతో ఉందని కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు 512 టీఎంసీలను ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణకు కేటాయించేలా సీఎం చంద్రబాబు కృషి చేశారని ఆయన చెప్పారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాయలసీమ అత్యంత నీటి దుర్భిక్షంతో కొట్టుమిట్టాడుతోందని ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆగ్రహించారు. కనీసం తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అసెంబ్లీ సాక్షిగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు లేకుండా ఎన్డీఏ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చెప్పారు.

వారిని పట్టించుకోలేదు..

పోలవరం నిర్వాసితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం భూములు, ఇళ్లు వదులుకున్నారని అసెంబ్లీలో పోలవరం ఎమ్మెల్యే బాలరాజు చెప్పారు. వారి కోసం 70 శాతం పునరావాస కార్యక్రమాలు గత టీడీపీ హయాంలోనే పూర్తి చేశారని ఆయన చెప్పారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఒక్క నిర్వాసితుడికీ న్యాయం చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత పోలవరాన్ని ఏపీకి కేంద్రం ఇచ్చిందని, దాన్ని మె?దట నాశనం చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. 960 మెగావాట్ల విద్యుత్, లక్షల ఎకరాలకు సాగునీరు, 60 లక్షల గృహాలకు విద్యుత్ ఇవ్వగల ప్రాజెక్టు పోలవరం అని ఆయన చెప్పుకొచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో నవయుగ కంపెనీ 72 శాతం పనులు పూర్తి చేయడంతోపాటు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిందని అసెంబ్లీలో ఆయన చెప్పారు. అయితే ప్రభుత్వం మారడంతో 10 నెలలపాటు రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చి ప్రాజెక్టును రివర్స్ చేశారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. అటువంటి ప్రాజెక్టును తిరిగి చంద్రబాబు సీఎం అయ్యాక.. కేంద్రం నుంచి రూ.13వేల కోట్లు తెచ్చి మరలా జీవం పోసారని కొనియాడారు.

అందుకే కొట్టుకుపోయింది..

వైసీపీ హయాంలో గత అయిదేళ్లపాటు ఒక్క ఎకరాకు అదనపు నీరు ఇవ్వలేదని ఏపీ అసెంబ్లీలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. జలయజ్ఞాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ఫ్యాన్ పార్టీ అధినేత చివరకు ఉన్న ప్రాజెక్టులనూ పట్టించుకోలేదని మండిపడ్డారు. కమీషన్ల కోసం రివర్స్ టెండరింగ్‌కు గత ప్రభుత్వం వెళ్లిందని ఆరోపించారు. పల్నాడు జిల్లాలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. పోలవరం వద్ద ఎగువ కాఫర్ డ్యామ్ గ్యాప్ భర్తీ చేయకపోవడం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అన్నారు. పోలవరానికి జగన్ పొగపెట్టారని, అమరావతికి అగ్గిపెట్టారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. గండికోట ప్రాజెక్టుకు డబ్బులు ఇవ్వకుండా ఆపేశారని ఆయన ఆగ్రహించారు. వైసీపీ అధినేత జగన్‌కు ఏ సబ్జెక్టుపైనా అవగాహన లేదని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విమర్శించారు.

గంజాయి రవాణలో నైపుణ్యం పెంచారు

-పాడేరు కాఫీ తోట్లల్ని పట్టించుకోలేదు
-ఆడవాళ్లపై అసభ్య పోస్టులు పెట్టటం నేర్పారు
-ఎవరని నరకాలి, ఎవరిని చంపాలో నేర్పారు
-9 ఐటీడీఏలను పని చేయనీయలేదు
-అసెంబ్లీలో గిరిజన శాఖ మంత్రి సంధారాణి

అమరావతి, నవంబర్ 19:గత అయిదేళ్లల్లో గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఎటువంటి శిక్షణ ఇవ్వలేదని, పాడేరులో కాఫీ తోటల పెంపకం వదిలి, గంజాయి పెంపకంలో గిరిజనులకు శిక్షణ ఇచ్చారని గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి మండిపడ్డారు. గిరిజనులకు శిక్షణ నిలిపి, మహిళలపై అత్యాచారాల, అక్రమ కేసులు పెట్టడం, భూ దురాక్రమణ లు, రౌడీయిజం లో తమ పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారని ఘాటుగా విమర్శించారు. గిరిజన యువత, విద్యార్థులకు శిక్షణ తీరుతెన్నూ, ప్రభుత్వ బకాయిలపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గత అయిదేళ్లల్లో స్కిల్ డవలప్ మెంట్ శిక్షణలు కుంటుపడ్డాయన్నారు. 2019 నుంచి 23 వరకూ య సెట్ పథకంలో ఆదరణ, సున్నా, చేయూత పథకాలకే బటన్ నొక్కారని, యువతకు సిల్క్ డవలప్ మెంట్ శిక్షణ ఇవ్వలేదన్నారు.

స్కిల్ డవలప్ కోర్సుల్లో నే బాకీలు ఉన్నాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో 9 ఐటీడీఏ పరిధుల్లో వైటీసీ యూత్ ట్రైనింగ్ సెంటర్లలో సిల్క్ డవలప్ మెంట్ కోర్సుల్లో శిక్షణ క్రమేపీ నిలిపివేశారని మంత్రి వివరించారు. 2015..16లో 500 మందికి శిక్షణ ఇవ్వగా.. ఖర్చులు చెల్లించామని, 2019 నుంచి 23 వరకూ.. ట్రైనింగ్ క్లాసుల్లో యువత సంఖ్య తగ్గిపోయిందన్నారు. 2019..20 మధ్య 10,000 మందికి శిక్షణ ఇస్తే.. 2020..21 మధ్య 4000కు పడిపోయిందని, 2221..2022లో 3000 కు , 2022..23లో 1300కి పడిపోగా.. 2023..24లో ఈ కోర్సులే లేవన్నారు. మహిళలపై అసభ్యంగా పోస్టులు పెట్టటం, అక్రమ కేసులు పెట్టటంపైనే శిక్షణ సాగిందన్నారు.

అప్పన్నను దర్శించుకున్న అధికారులు

విశాఖపట్నం, నవంబర్ 19 మంగళవారం ఉదయం కర్ణాటక స్టేట్ కి చెందిన ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకయ్య, ఐపిఎస్ కృష్ణమరాజు, ఐ.ఆర్.ఎస్ మహాదేవ్ లు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ పర్యవేక్షణ అధికారి విక్రమ్ త్రిమూర్తులు పి ఆర్ ఓ నాయుడు స్వాగతం పలికారు.

వారు ముందుగా కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నారు. తదుపరి బేడా మండపం ప్రదర్శన అనంతరం స్వామివారి అంతరాయ దర్శనం తదుపరి వేద పండితులచే వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వీరితో శ్రీశైలం కృష్ణారావు మూర్తి రాజు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఏసీబీ వలలో ఇద్దరు 'ఆర్ఐ'లు

-లంచం తీసుకుంటుండగా పట్టివేత
-కొనసాగుతున్న విచారణ
-ఇంతలో పారిపోయిన ఆర్ఐ శ్రీధర్

కరీంనగర, నవంబర్ 19: పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. విచారణ కొనసాగుతుండగా నిందితుల్లో ఒకరైన శ్రీధర్ పారిపోయారు. మరో నిందితుడు శ్రీమాన్ ఏసీబీ అధికారుల అదుపులో ఉన్నారు.

పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఆర్ఐలు శ్రీమాన్, శ్రీధర్ ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటున్నారు. అదే సమయంలో చుట్టూ ఉన్న ఏసీబీ అధికారులు వెంటనే పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తుండగా శ్రీధర్ పరారీ అయ్యారు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది.

పువ్వుల్లో పుప్పొడి అభివృద్ధి, గింజల రూపకర్తను గుర్తించిన శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, నవంబర్ 19మొక్కల్లోని పురుష పునరుత్పత్తి వ్యవస్థ, పుప్పొడి, విత్తన తయారీలో కీలకపాత్రను పోషిస్తున్న ఒక కొత్త జన్యువును శాస్త్రవేత్తలు గుర్తించారు. పుష్పించే జాతి అరాబిడోస్ కు చెందిన క్యాబేజీ, ఆవాల మొక్కల్లో ఈ జన్యువును గుర్తించారు. పంట ఫలదీకరణ, విత్తన ఉత్పత్తినీ మరింత మెరుగుపరిచేందుకు ఈ పరిశోధనా ఫలితాలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

మొక్క జీవనచక్రంలో- పుప్పొడి తయారీ చాలా ముఖ్యమైన దశ. దీనినే పురుష గ్యామెటోఫైట్ దశగా పేర్కొంటారు. అండాశయానికి జన్యు పదార్థాన్ని బదిలీ చేయడానికి ఈ గ్యామెటోఫైట్ ముఖ్యం. ఫలదీకరణకు ఉపయోగపడే పుప్పొడి రేణువుల ఉత్పత్తి, బదిలీ అవసరం. నాణ్యమైన పుప్పొడి రేణువులు కీలం ద్వారా ప్రయాణించి అండాశయాన్ని చేరతాయి. ఇవన్నీ సజావుగా సాగినపుడు మాత్రమే మంచి విత్తనాలు తయారవుతాయి. పుప్పొడి అభివృద్ధి క్రమం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం ద్వారా- పుష్పించే మొక్కల్లో పునరుత్పత్తి ప్రక్రియ ఎలా జరుగుతుందన్న విషయం తెలియడంతోపాటు, పంట దిగుబడిని పెంచేందుకు అవసరమైన సమాచారం కూడా లభిస్తుంది.

ఆరోగ్యకరమైన పుప్పొడి ఏర్పడే ప్రక్రియలో- పుప్పొడి ఎంత వేగంగా ఏర్పడుతోందన్న అంశంతోపాటు, పువ్వులోని కీలం అభివృద్ధి ఎలా ఉందన్నది కూడా ముఖ్యమే. పుప్పొడి చివరికి అండాశయాన్ని చేరి ఫలదీకరణ దశకు చేరడం- పుష్పించే మొక్కల్లో జరిగే ప్రాథమిక ప్రక్రియ. కీలం లోపల ఏర్పడే పుప్పొడి గొట్టాలు బాగా వదులుగా మారి, ఎంత ఎక్కువ దారి ఇవ్వగలిగితే ఫలదీకరణ అంత విజయవంతంగా జరుగుతుంది. అలాగే, పుప్పొడి- కీలాంగ్రంపై పడినపుడు పుప్పొడి రేణువుల బాహ్యత్వచ నిర్మాణం కూడా ముఖ్యమే అవుతుంది. పుప్పొడి అభివృద్ధి, కీలాగ్రం నుంచి పుప్పొడి నీటిని పీల్చుకోవడం, పుప్పొడి నుంచి రేణువులు విడుదల కావడం వంటి ప్రక్రియలను కణ స్థాయిలో అర్థం చేసుకోవడం అవసరం. పక్వానికి వచ్చిన పుప్పొడి రేణువుల విడుదలకు ఈ దశలన్నీ కూడా ముఖ్యం. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం పరిధిలో- కోల్ కతాలోని బోస్ ఇనిస్టిట్యూట్ కు చెందిన ప్రొఫెసర్ షుభో చౌధురి -ఈ అంశంపై పరిశోధనలు చేసి, హెచ్ఎంజీబీ15 అనే జన్యువు ఈ దశలన్నీ సక్రమంగా జరగడానికి కారణంగా తెలుసుకున్నారు. పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి హెచ్ఎంజీబీ15 అనే హిస్టోనేతర ప్రొటీన్ కారణంగా గుర్తించారు. ఈ ప్రొటీన్ - అరాబిడోస్ మొక్కల్లోని పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థను నియంత్రిస్తోందని తేలింది.

ఈ జన్యువులో ఉత్పరివర్తనాన్ని కలిగించడం... మొక్కల్లో పాక్షిక వ్యంధ్యత్వానికి కారణమని తెలిసింది. ఉత్పరివర్తనానికి గురి చేసిన మొక్కల్లో? ఫలదీకరణకు తక్కువ అవకాశం ఉన్న పుప్పొడి ఏర్పడింది. పుప్పొడి కణత్వచాల నాణ్యత తగ్గిపోయింది. పుప్పొడి గొట్టాల నుంచి పుప్పొడి రేణువుల విడుదల తగ్గిపోయింది. కొన్నింటిలో కీలాల పొడవు తగ్గిపోయి పుప్పొడి కీలాగ్రాలను చేరే అవకాశాలు తగ్గిపోయాయి. ఇవన్నీ కూడా పంట దిగుబడిపై ప్రభావాన్ని చూపించాయి. పుప్పొడి అభివృద్ధి, పక్వం, పుప్పొడి గొట్టాల ఏర్పాటు అంశాల్లో వచ్చిన తేడాలన్నీ కూడా జన్యువులో జరిగిన కృత్రిమ ఉత్పరివర్తనం వల్లనే.

ఫైటోహార్మ్స్ జాస్మానిక్ యాసిడ్ (జేఏ), కీలంలోని టాపెటల్ కణాల మరణం, యాక్టిన్ శృంఖల చర్యల్లో తేడాలు- వంటి కృత్రిమంగా చేసిన క్రియల్లో జరుగుతున్న కణస్థాయి విశ్లేషణల ఆధారంగా- హెచ్ఎంజీబీ15 జన్యువులో జరిగే సహజ ప్రక్రియను అడ్డుకోవడమేనని రూఢి అయింది.

మొక్కల్లోని జీవ క్రియను మరింత లోతుగా తెలుసుకోవడానికి తరచూ ఉపయోగించే మొక్కల్లో- ఈ యాంత్రికతను అర్థం చేసుకోవడం వల్ల మొక్కల జీవ క్రియలను మరింత లోతుగా తెలుసుకోవడం సాధ్యం అయింది. పంట దిగుబడులను పెంచడానికీ, విత్తనోత్పత్తికీ ఈ అవగాహన మెరుగ్గా ఉపయోగ పడుతుంది. ప్లాంట్ ఫిజియాలజీ (సచ్చేవ్, తదితరులు...2024), ప్లాంట్ రిప్రొడక్షన్ (బిశ్వాస్ తదితరులు 2024) పత్రికల్లో ఈ పరిశోధనా ఫలితాలు ప్రచురితం అయ్యాయి. ఎన్ ఈఆర్బీ, ఇండియా ఈ పరిశోధనలకు ఆర్థిక సాయం అందించింది.

'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' జాతీయ యువజనోత్సవాలను ప్రకటించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, నవంబర్ 19ఈ ఏడాది సరికొత్త రూపంలో నిర్వహించనున్న యువజనోత్సవాల వివరాలను ఈ రోజు ఢిల్లీలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. దేశ భవిష్యత్తులో యువతను భాగం చేయాలనే ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' పేరుతో దీనిని పిలుస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా యువత తమ ఆలోచనలను, దృక్పథాలను పంచుకునేందుకు ఇది క్రియాశీలక వేదికగా ఉపయోగపడుతుంది.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముఖ్యోద్దేశాలను తెలియజేస్తూ "ఈ ఉత్సవాలు యువ ప్రతిభను పోత్సహించడానికీ, వికసిత్ భారత్ సాధన దిశగా వారి ఆలోచనలను పంచుకొనేందుకూ ఈ వేదిక ఆసరాగా ఉంటుంది" అని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈ వేదికల్లో ప్రధానమంత్రితో నేరుగా ముచ్చటించి, భారత్ భవిష్యత్తు కోసం తమ ఆలోచలను తెలియజేసే అవకాశం దక్కుతుంది. తద్వారా రాజకీయంగా, సామాజికంగా యువత భాగస్వామ్యాన్ని పెంచవచ్చు.

ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారిస్తూ ఈ ఏడాది 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'ను రూపొందించినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు. మొదటిది, యువతను రాజకీయాల వైపు నడిపించడం. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువతీయువకులను ఈ రంగంలోకి తీసుకురావాలని అన్నారు. యువతలోని నాయకత్వ సామర్థ్యాన్ని గుర్తించి, ప్రోత్సహించడంతో పాటు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమక్షంలో వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా తమ ఆలోచనలను పంచుకునే అవకాశాన్ని ఈ జాతీయ యువజనోత్సవాలు అందిస్తాయి.

రెండోది, పారదర్శకమైన, ప్రజాస్వామ్యయుతమైన, ప్రతిభ ఆధారిత ఎంపిక విధానం ద్వారా వికసిత్ భారత్ దిశగా యువతను భాగస్వాములను చేయడం. ఈ కార్యక్రమం భారత్ పురోభివృద్ధిలో భాగం పంచుకొనే దిశగా తర్వాతి తరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికున్న నిబద్ధతను తెలియజేస్తుంది.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ? జాతీయ యువజనోత్సవాలు 2025లో మూడు విభిన్న విభాగాలుగా ఎంపిక చేసిన యువతతో అసెంబ్లీని నిర్వహిస్తుంది. మొదటి విభాగంలో వికసిత భారత్ ఛాలెంజ్ లో పాల్గొన్నవారు ఉంటారు. రెండో విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల నుంచి ఎంపికైన ప్రతిభావంతులు ఉంటారు. ఇక్కడ వారు చిత్రలేఖనం, సైన్స్ ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఉపన్యాసం తదితర విభాగాల్లో పోటీపడతారు. మూడో విభాగంలో వ్యాపారం, క్రీడలు, వ్యవసాయం, సాంకేతికత సహా విభిన్న రంగాల్లో నూతన ఒరవడిని సృష్టించినవారు, యూత్ ఐకన్లు ఉంటారు.

'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' ఉత్సవం కంటే ఎక్కువ- ఇది దేశాభివృద్ధిలో చురుకైన భాగస్వామ్యం అందించేలా యువతను తీర్చిదిద్దే ఉద్యమం. వికసిత్ భారత్ ఛాలెంజ్ లాంటి కార్యక్రమాల ద్వారా, వారి ఆలోచనలను తెలియజేసేందుకు, ఆలోచనాపరులతో చర్చించేందుకు, అభివృద్ధి చెందిన భారత్ అనే లక్ష్యాన్ని సాధించేందుకు తమ వంతు సహకారం అందించే వేదికగా ఇది నిలవనుంది.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. కుంచాల సునీత..

నిజామాబాద్, నవంబర్ 19: సర్వేంద్రియానాం నయనం ప్రధానమని, నేత్రాల పరిరక్షనే ప్రధానమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల కోరారు. బుధవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ సౌజన్యంతో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ సమావేశపు హాల్ లో కంటి వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. మానవ శరీరంలో కళ్ళ ప్రధాన అవయవాలని, కంటి చూపుతో విశ్వాన్ని దర్శించవచ్చని ఆమె తెలిపారు.

మనిషి మరణానంతరం నేత్రాలను మరో మనిషికి దానం చేసే గొప్ప అవయవంగా వైద్య పరిభాషలో పేర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. నేత్రధానం వలన మరికొందరు ప్రపంచాన్ని చూడగలుగుతున్నారన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సామాజిక దృక్పథంతో వైద్యారోగ్య శిబిరం నిర్వహించడాన్ని జిల్లా జడ్జి ప్రశంసించారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పని ఒత్తిడికి లోనవుతారని దాని వలన కళ్లపైన ప్రభావం పడుతుందన్నారు. కంప్యూటర్లు, సెల్ ఫోన్స్, ల్యాప్ ట్యాప్, ట్యాబ్ ల వినియోగం వలన నేత్రాలు రకరకాల అనారోగ్య సమస్యల పాలవుతున్నాయని, దీనిని అధిగమించడానికి కంటి వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు.

డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి డాక్టర్ శరత్ జోషి ఆస్పత్రి అప్తమలిస్ట్ విభవ్ చరణ్ గౌడ్ గణేష్ సంజయులు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ గవర్నమెంట్ ప్లీడర్ వెంకట రమణ గౌడ్, న్యాయవాదులు ఎం.లక్ష్మణ్, కవిత రెడ్డి, అంజలి, రజిత, అరిటి నారాయణ రాణదేశ్ మానిక్ రాజు, విగ్నేష్, చింతకుంట సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోర్చుగల్ ప్రధానితో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భేటీ

న్యూఢిల్లీ, నవంబర్ 19బ్రెజిల్ లోని రియో డి జనీరో లో జి20 శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న సందర్భంగా పోర్చుగల్ ప్రధాని శ్రీ లుయిస్ మోంటెనెగ్రో తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. ఇది ఈ నేతలిద్దరికి తొలి సమావేశం. గత ఏప్రిల్ లో పదవీ బాధ్యతలను చేపట్టిన శ్రీ మోంటెనెగ్రోను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు. భారతదేశానికి, పోర్చుగల్ కు మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపరచుకోవడానికి, విస్తరింపచేసుకోవడానికి కలసి పని చేయాలని శ్రీ మోదీ అన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన శ్రీ నరేంద్ర మోదీకి శ్రీ మోంటెనెగ్రో అభినందనలు తెలియజేశారు.

వ్యాపారం, పెట్టుబడి, రక్షణ, సైన్స్, టెక్నాలజీ, పర్యటన రంగం, సాంస్కృతిక రంగం, ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు సహా వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని గురించి నేతలు చర్చించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ రంగ సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, అంకుర సంస్థలు (స్టార్ట్-అప్స్) నూతన ఆవిష్కరణలు (ఇన్నోవేషన్), ఇరు దేశాల మధ్య వృత్తినిపుణుల, నైపుణ్యం గల కార్మికుల రాక పోకలు, తదితర నూతన రంగాలతో పాటు కొత్తగా ఉనికిలోకి వస్తున్న రంగాల్లో సహకరించుకొనే అవకాశాలు అంతకంతకు విస్తరిస్తున్నాయని నేతలు గుర్తించారు. భారతదేశం-యూరోపియన్ యూనియన్ సంబంధాలతో పాటు ప్రాంతీయ సమస్యలపైనా, ఇరు దేశాల ప్రయోజనం ముడిపడిన ప్రపంచ సమస్యలపైనా నేతలిద్దరూ తమ ఆలోచనలను పరస్పరం పంచుకున్నారు. ప్రాంతీయ వేదికలలోనూ, బహు పాక్షిక వేదికలలోనూ ఇప్పుడు కొనసాగిస్తున్న సన్నిహిత సహకారాన్ని ఇక మీదటా కొనసాగించాలని వారు అంగీకరించారు.

భారతదేశం - పోర్చుగల్ దౌత్య సంబంధాలు వచ్చే ఏడాదిలో 50వ సంవత్సరంలో అడుగుపెడుతున్నాయన్న విషయాన్ని నేతలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భాన్ని సముచిత రీతిలో ఒక ఉత్సవంగా జరుపుకోవాలని వారు నమ్మతించారు. పరస్పర సంప్రదింపులను కొనసాగించాలని వారు అంగీకరించారు.

లగచర్ల కేసులో కీలక నిందితుడు సురేష్ లొంగుబాటు

హైదరాబాద్, నవంబర్ 19:లగచర్లలో అధికారులపై దాడి కేసులో కీలక నిందితుడు బోగమోని సురేశ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో సురేశ్‌ను కొడంగల్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు.

అతడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా, కలెక్టర్‌పై దాడి కేసులో సురేశ్‌ను ఏ2గా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఘటన జరిగిన నాటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు మంగళవారం ఉదయం పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

కలెక్టర్ బృందాన్ని ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద నుంచి ఊరిలోకి తీసుకెళ్లడంలో సురేశ్ కీలకంగా వ్యవహరించాడు.

అక్కడికి వెళ్లిన వెంటనే ఆందోళనకారులు నినాదాలు చేస్తూ ముందుకు దూసుకురావడంతో గందరగోళం నెలకొంది. ఆ సమయంలో సురేశ్ సైతం నినాదాలు చేసినట్లు వీడియోల్లో కనిపించడంతో ఆయనే పక్కా పథకంతో అధికారుల్ని అక్కడికి రప్పించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పటికే వారిని రెచ్చగొట్టి దాడికి సిద్ధం చేసి ఉంటాడని.. కలెక్టర్ వాహనం దిగిన క్షణాల వ్యవధిలోనే ఆందోళనకారులు ఆయనపైకి దూసుకురావడంతోపాటు వెంకట్‌రెడ్డిని వెంటాడి కొట్టేందుకు అదే కారణమై ఉంటుందని నమ్ముతున్నారు. దీంతో సురేశ్‌ను పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించే అవకాశముంది.

మహిళల మిస్సింగ్ కేసులు ఛేదించిన పోలీసులు.. అభినందించిన పవన్ !

అమరావతి, నవంబర్ 19:ఏపీ లో మహిళలు, బాలికలు అదృశ్యంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి స్పందించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సుమారుగా 30 వేల మంది మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారని ఇంత జరిగినా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు మారాయన్నారు. పటిష్టమైన లా అండ్ ఆర్డర్ అమలు చేస్తామని ఎన్డీఏ కూటమి ముందే చెప్పిందంటూ ట్వీట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 18 మంది అమ్మాయిల మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు అనే వార్తను పోస్ట్ చేస్తూ ఈ సందర్భంగా హోంమంత్రి అనిత నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ పోలీసులను, హోంశాఖను పవన్ కల్యాణ్ అభినందించారు.

మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు గానూ పోలీసులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి గ్రామాలు, పట్టణాలు, నగరాలను సురక్షితంగా, మరింత భద్రంగా మార్చడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మురళిధరస్వామికి ధార్మిక చాత్తాద శ్రీ వైష్ణవ సమైక్య వేదిక ఘన సన్మానం

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జాతీయ బి. సి. సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులుగా నియమితులైన శ్రీమాన్ తిరుత్తోమాల. మురళిధరస్వామిని ధార్మిక చాత్తాద శ్రీ వైష్ణవ సమైక్య వేదిక ఆధ్వర్యం లో సోమవారం హైదరాబాద్ సైనిక్ పూరి లో జరిగిన కార్యక్రమం లో సమైక్య వేదిక అధ్యక్షుడు .తోమాల. వేణు, శ్రీ వెంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి బాధ్యులు . టి. నరసింహం, దాశరథి వెంకట రమణ కలుసుకున్న శుభ తరుణంలో దుశ్శాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా తోమాల. కొండస్వామి మాట్లడుతూ దేశ బి.సి. కమ్యూనిటీల సంక్షమంతో ధీటుగా, తెలంగాణ రాష్ట్ర చాత్తాద శ్రీ వైష్ణవ కమ్యూనిటీ సంక్షేమం కోసం ప్రభుత్వపరంగా మన కమ్యూనిటీ అర్హతగల రావాల్సిన రాయితీలను,ఇతర సౌకర్యాలను మన కమ్యూనిటీ భగవధ్ బంధువులకు అందేవిధంగా కృషి చేయాలని కోరారు.

దానిపై వారు సహృదయంతో స్పందించి మన కమ్యూనిటీ కొరకు ప్రభుత్వపరంగా ఏది సాధించుకోవాలన్నా మన భగవధ్ బంధువుల ఐక్యతతో కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో మాత్రమే సాధ్యమని దానికి మన కమ్యూనిటీ నందు ఉన్న సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఐక్యకార్యాచరణ వేదిక ద్వారా మాత్రమే మన సాధించగలమని దానికి రాష్ట్ర కార్యాచరణ ఐక్యవేదిక ద్వారా కృషి చేస్తానని దానికి అందరూ సహృదయంతో సహకరించాలని మురళిధరస్వామిక కోరారు.. ఈ కార్యక్రమంలో పెరుంబూదూరి. వెంకటస్వామి, మాజీ. యం. పి. పి, కేసముంద్రం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పట్నంకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, నవంబర్ 19: లగచర్ల దాడి కేసులో అరెస్టయి, రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. హైదరాబాద్ చర్లపల్లి జైల్లో ఉన్న ఆయనను తోటి ఖైదీలతో ఉంచకుండా.. ప్రత్యేక బ్యారక్ ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను హైకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి భోజనం తెప్పించుకోవడానికి కూడా కోర్టు అనుమతించింది. మరోవైపు నరేందర్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను వికారాబాద్ కోర్టు వాయిదా వేసింది. రిమాండ్ ఆర్డర్‌ను క్వాష్ చేయాలనే పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున బెయిల్ పిటి షన్ విచారణను వాయిదా వేస్తున్నట్టు వికారాబాద్ కోర్టు తెలిపింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. కాగా, క్వాష్ పిటిషన్ విచారణ హైకోర్టు రేపు చేపట్టనుంది.

నాలుగు బ్యాంకుల్లో వాటాలు విక్రయించే యోచనలో కేంద్రం!

న్యూఢిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులు..సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో వాటాను తగ్గించుకోవాలని కేంద్రం యోచిస్తోందని వినికిడి. దీని కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖ రాబోయే నెలల్లో కేంద్ర కేబినెట్ నుంచి ఆమోదం పొందే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 93 శాతం, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లో 96.4 శాతం, యూకో బ్యాంక్ లో 95.4 శాతం, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ లో 98.3 శాతం కంటే ఎక్కువ వాటా ఉంది. సెబీ నిబంధనల ప్రకారం అన్ని నమోదిత కంపెనీల్లో పబ్లిక్ షేర్ హోల్డింగ్ 25 శాతం ఉండాలి. అయితే ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలకు సెబీ నిబంధనల నుంచి మినహాయింపు 2026 ఆగస్టు వరకు ఇచ్చింది. కాగా ఈ నిబంధనలకు అనుగుణంగా 75 శాతం కంటే దిగువకు తీసుకొచ్చేందుకు బ్యాంక్ లు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.

కాగ్ కొత్త చీఫ్‌గా తెలుగు అధికారి

-కె.సంజయ్ మూర్తిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) పదవిలో తెలుగు అధికారి నియమితులయ్యారు. అమలాపురానికి చెందిన ఐఏఎస్ అధికారి కె.సంజయ్ మూర్తి కాగ్ కొత్త చీఫ్ అయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1989 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ మూర్తిని కాగ్ చీఫ్ గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ దీనికి సంబంధించిన ప్రకటన విడుదల చేసింది.ప్రస్తుతం కె. సంజయ్ మూర్తి కేంద్ర విద్యా శాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 21న ఆయన కాగ్ చీఫ్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం కాగ్ చీఫ్ గా ఉన్న గిరీశ్ చంద్ర ముర్ము పదవీకాలం నవంబర్ 20తో ముగియనున్నది. దాంతో కేంద్రం సంజయ్ కుమార్ ను ఆయన స్థానంలో నియమించింది.సంజయ్ మూర్తి 1964 డిసెంబర్ 24న జన్మించారు. ఆయన అమలాపురం మాజీ ఎంపీ కెఎన్ఆర్ మూర్తి కుమారుడు. 1989లో సివిల్స్ లో హిమాచల్ ప్రదేశ్ కేడర్ కు ఎంపికయ్యారు.

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం పొడిగింపు ?



న్యూ డిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బి;భారతీయ రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలాన్ని కేంద్ర మరోసారి పొడిగించే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలిసింది. ఆయన ప్రస్తుత పదవీ కాలం వచ్చే నెల డిసెంబర్ 10తో ముగియనుంది. ఈ స్థానం కోసం ఇతర అభ్యర్థులను ఎవరినీ ఇప్పటి వరకూ ఎంపిక చేయలేదని తెలిసింది. దీంతో ఆయన పదవీకాలం రెండోసారి పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. మహారాష్ట్ర ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత పొడిగింపును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.కాగా, 1980వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్.. 2018 డిసెంబర్ 12న ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కేంద్రం శక్తికాంత దాస్‌ను నియమించింది. అప్పటి నుంచి అదే పదవిలో కొనసాగుతున్నారు. 2021 డిసెంబర్ 10కి ఆయన మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో.. కేంద్రం మరోసారి ఆయనకే పట్టం కట్టింది. శక్తికాంత దాస్ పట్ల కేంద్ర ప్రభుత్వం విశ్వాసం ప్రకటించింది. మరో మూడేండ్ల పాటు ఆయన ఆ పదవీకాలం పొడిగించారు. ఈ ప్రకారం వచ్చే నెల డిసెంబర్‌తో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. అయితే, మరోసారి ఆయన్ని ఆర్బీఐ గవర్నర్‌గా కొనసాగించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఐదేళ్ల కంటే ఎక్కువకాలం ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ ఉన్నారు. మరోసారి ఆయన పదవీకాలం పొడిగిస్తే.. బెనగల్ రామారావు తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా చేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు. రామారావు 1949-1957 మధ్య ఏడున్నర సంవత్సరాల పాటు ఆర్బీఐ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఆయనే అత్యధిక కాలం ఆ పదవిలో ఉన్నారు. ఇప్పుడు ఆయన తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.1980వ బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శక్తికాంత దాస్.. 2017 వరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శిగా పని చేశారు. 2016లో నోట్ల రద్దు టైంలో కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆర్థికశాఖలో పని చేస్తున్నప్పుడు 8 బడ్జెట్ల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు. ఆర్థికం, పన్నులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 38 ఏండ్ల కెరీర్‌లో శక్తికాంత దాస్ వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

నవంబర్ 21 నుండి 24 వరకు ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలు..

-ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నవంబర్ 21 తేది నుండి 24 తేది వరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు ప్రారంభించనున్నారని చైర్మన్ మెట్టు సాయికుమార్ గారు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీధర్ బాబు, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ గారు,సీతక్క టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు హాజరు కానున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా పాల్గొననున్నట్లు చైర్మన్ మెట్టు సాయికుమార్ గారు పేర్కొన్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నందు మత్స్యకారులు వివిధ రకాల ఫిష్ వంటకాలు చేసి ప్రదర్శిస్తారని, ప్రతిభ కనబర్చిన మత్స్యకారులు ప్రముఖుల చేత అవార్డులు అందుకుంటారని తెలిపారు. హైదరాబాద్ మహా నగరంలో నవంబర్ 21వ తేది నుండి నవంబర్ 24 వ తేది వరకు నాలుగు రోజుల పాటు ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుందని అన్నారు. ఈ నెల 21వ తేది నుండి 24వ తేది వరకు హైదరాబాద్ లోని డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్ దగ్గర, ఐమాక్స్ థియేటర్ పక్కన జరగబోయే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఉత్సవాలకు రాష్ట్రంలోనున్న నలుమూలల నుండి మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు.

యుద్ధ సంక్షోభం రాబోతుందా?..

న్యూఢిల్లీ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: నాటో దేశాల్లో జనం యుద్ధ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం అవుతున్నారు. నార్వే, స్వీడెన్, ఫిన్‌ల్యాండ్ దేశాలు తమ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. ఒకవేళ సంక్షోభం తలెత్తితే, దాన్ని ఎదుర్కొనేందుకు అన్ని నిత్యావసరాలు స్టాకప్ చేసుకోవాలని ఆయా దేశాల్లో ప్రభుత్వ ప్రచారం జరుగుతోంది. ఒకవేళ యుద్ధం వచ్చినా.. లేదా ఏదైనా సంక్షోభం వచ్చినా.. దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న రీతిలో అనేక నార్డిక్ దేశాలు తమ ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు స్థానిక మీడియాలు పేర్కొంటున్నాయి.స్వీడెన్ తమ ప్రజలుకు లక్షల్లో బుక్‌లెట్లను పంచుతోంది. సంక్షోభం లేదా యుద్ధం వస్తే ఏం చేయాలన్న టైటిల్‌తో ఆ బుక్స్‌ను రిలీజ్ చేసింది. ఈసారి పంచిన కరపత్రాలు భారీ సైజులో ఉన్నట్లు చెబుతున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో పరిస్థితి మరీ క్షీణిస్తోందని, అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వీడెన్ ఆ కరపత్రాల్లో చెబుతు ఉన్నట్లు తెలుస్తోంది. సెక్యూర్టీ పరిస్థితి చాలా భయానకంగా ఉందని, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మనం సంసిద్ధంగా ఉండాలని, యుద్ధాన్ని కూడా ఎదుర్కోవాలని స్వీడిష్ సివిల్ కాంటిన్‌జెన్సీ ఏజెన్సీ డైరెక్టర్ మైఖేల్ ప్రిసెల్ తెలిపారు.ఇక యుద్ధ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఫిన్‌ల్యాండ్ ఏకంగా ఓ కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. సంక్షోభ యుద్ధ పరిస్థితుల్ని ఎదుర్కోనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆ బుక్‌లెట్‌లో చెప్పింది. నార్వేలో కూడా కరపత్రాలను జారీ చేస్తున్నారు. వాతావరణం సరిగా లేకపోయినా.. యుద్ధం వచ్చినా.. ఆ పరిస్థితిని ఓ వారం రోజుల పాటు స్వయంగా ఎదుర్కొనేందుకు రెడీగా ఉండాలని ఆ కరపత్రంలో తెలిపారు. సంక్షోభం వచ్చినప్పుడు ఎలా దాన్ని ఎదుర్కోవాలన్న రీతిలో ఎక్కువ శాతం మార్గదర్శకాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు తమను తాము కాపాడుకోవాలన్న సందేశాన్ని ఇచ్చారు.

దివ్యాంగజన్‌లో, భారతదేశం యొక్క నాగరికత దైవత్వం, ఉత్కృష్టత మరియు ఆధ్యాత్మికతను చూస్తుంది- వైస్ ప్రెసిడెంట్

న్యూఢిల్లీ, నవంబర్ 19వైస్ ప్రెసిడెంట్ శ్రీ జగదీప్ ధన్‌కర్ ఈ రోజు మాట్లాడుతూ, "ప్రపంచంలో మన నాగరికత ప్రత్యేకమైనది, 5000 సంవత్సరాల కంటే ఎక్కువ పురాతనమైనది. అది ఏమి ప్రతిబింబిస్తుందో, దివ్యాంగంలో మనం దైవత్వాన్ని చూస్తాము, ఉత్కృష్టతను చూస్తాము, ఆధ్యాత్మికతను చూస్తాము.

ఈరోజు న్యూ ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో స్పెషల్ ఒలింపిక్స్ ఆసియా పసిఫిక్ బోస్ ఉ బౌలింగ్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ ధంఖర్ ఇలా అన్నారు, "ఈ ఆటల ద్వారా, మేము చాలా ముఖ్యమైనదాన్ని జరుపుకుంటున్నాము మరియు అది చేరిక మరియు గౌరవం. ఆసియా పసిఫిక్ అంతటా ప్రత్యేక వికలాంగుల కోసం. ఇది భారతదేశ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ప్రత్యేక ఒలింపిక్స్ సార్వత్రిక చేరికకు మా నిబద్ధతను సూచిస్తుంది. "

దేశంలోని యువత డిజిటల్ మక్కువపై ఆందోళన వ్యక్తం చేస్తూ శ్రీ ధాఖర్ ఇలా అన్నారు, "ఈ సందర్భంగా నేను మొత్తం సమాజానికి తీవ్రమైన ఆందోళనను తెలియజేయాలనుకుంటున్నాను మరియు ఇది చాలా తీవ్రమైనది. ఇది ఆందోళనకరంగా మారుతోంది. నేటి వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో మన యువత మరియు పిల్లలు చిన్న ప్లాస్టిక్ స్క్రీన్‌ల ద్వారా ఎక్కువగా వినియోగిస్తున్నారు– మొబైల్! వారు నిజమైన ప్లేగ్రౌండ్‌లకు దూరంగా డిజిటల్ ప్లేగ్రౌండ్‌లలోకి నెట్టబడ్డారు. ఈ చిన్న ప్లాస్టిక్ స్క్రీన్ కారణంగా పిల్లలకు నిజమైన ఆట స్థలాలు లేకుండా చూడాలని నేను ప్రత్యేకంగా ప్రతి తల్లిదండ్రులను అడుగుతాను. ఈ డిజిటల్ అబ్సెషన్ పిల్లలకు, ఆ తరానికి నిజమైన ఆటస్థలం యొక్క థ్రిల్, స్పిరిట్, జ్ఞానోదయాన్ని కోల్పోకుండా చూసుకుందాం.

ప్రత్యేక సామర్థ్యం ఉన్న అథ్లెట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను హైలైట్ చేస్తూ, శ్రీ ధంఖర్ ఇలా పేర్కొన్నాడు, "మీరు మైదానంలోనే కాదు, మనలో చాలా మంది ఊహించగల సవాళ్లకు వ్యతిరేకంగా మీరు విజయం సాధించిన జీవిత ఆటలో కూడా విజేతలు. వారి పనితీరును చూడటం చాలా సులభం కానీ ప్రతిబింబించండి, దాని ముఖంలోకి లోతుగా వెళ్ళండి. వారు ఈ సవాళ్లను 24లీ7 ఎదుర్కొంటారు మరియు వారి శక్తి, శక్తి మరియు ఉత్సాహాన్ని చూస్తారు.

తిరుగులేని మానవ స్ఫూర్తిని ఎత్తిచూపిన ఉపరాష్ట్రపతి, "వైకల్యం మానవ స్ఫూర్తిని మచ్చిక చేసుకోలేదనడానికి చరిత్రే నిదర్శనం. మానవ ఆత్మ లొంగదీసుకోవడానికి మించినది. సవాళ్ల యొక్క విపరీతమైన లేదా తీవ్రతతో సంబంధం లేకుండా మానవ ఆత్మ స్వయంగా వస్తుంది. ఆత్మ అణచివేయలేనిది. "

జీవితంలో క్రీడల ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన శ్రీ ధంఖర్, "క్రీడలు మాండలికానికి మించిన భాష. క్రీడలు నిఘంటువుకు మించిన భాష. క్రీడలు సార్వత్రిక భాష. క్రీడలు అన్ని అడ్డంకులను ఛేదిస్తాయి. మానవత్వం ద్వారా నిర్వచించబడిన అన్ని పరిమితులు, ఇరుకైన మనస్సు గల స్థలం క్రీడల ద్వారా అధిగమించబడతాయి. క్రీడలు మానవ మనస్సును ప్రత్యేకంగా శక్తివంతం చేస్తాయి మరియు ప్రత్యేక సామర్థ్యం గల పిల్లలు, బాలురు మరియు బాలికలు మరియు వృద్ధులకు సంబంధించిన క్రీడలు అయినప్పుడు, ఇది ఆశకు కొత్త వెలుగునిస్తుంది.

దేశంలో క్రీడల వల్ల అవగాహనలో పరివర్తనాత్మక మార్పును ప్రతిబింబిస్తూ, శ్రీ ధంఖర్ ఇలా నొక్కిచెప్పారు, "భారతదేశంలో క్రీడల పట్ల వైఖరిలో మనమందరం భూకంప మార్పును అనుభవించగలము. నా చిన్నప్పుడు మనం వినేవాళ్ళం.

"క్రీడ ఇకపై పార్శ్వేతర కార్యకలాపంగా చూడబడదు. ఇది విద్య మరియు జీవితంలో ఒక ముఖ్యమైన భాగం, లక్షణాన్ని పెంపొందించే వాహనం, ఐక్యతను పెంపొందించడం మరియు జాతీయ అహంకారంతో మనల్ని నింపడం", అన్నారాయన.

దేశ నిర్మాణంలో దివ్యాంగుల పాత్ర మరియు ఎనేబుల్ చేసే పర్యావరణ వ్యవస్థ ఆవిర్భావం గురించి నొక్కిచెప్పిన శ్రీ ధన్‌ఖర్, "దేశ నిర్మాణంలో ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తులు పోషించాల్సిన పాత్ర ఉంది. మానవాళిలో ఆరవ వంతుకు నిలయమైన అతిపెద్ద శక్తివంతమైన ప్రజాస్వామ్యం భారత్. ప్రజాస్వామ్య ప్రక్రియలో దివ్యాంగజనుల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం మరియు సంబరాలు చేసుకోవడం ద్వారా పాలన మరింత సమగ్రంగా మారడాన్ని చూసింది. మన ప్రజాస్వామ్య ప్రక్రియలో, ఎన్నికల కమీషన్ అన్ని చర్యలు తీసుకుంది, గ్రహం మీద ఉన్న ఏ వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కు, ఎన్నికల బ్యాలెట్ మరియు ఓటు ద్వారా అతని లేదా ఆమె భవితవ్యాన్ని నిర్ణయించడంలో భాగస్వామిగా ఉండటానికి ప్రతి అడుగు వేసింది. వారికి అందుబాటులో ఉంచబడింది."

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లమ్మి లబ్ధిపొందాలి- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఆదిలాబాద్, నవంబర్ 19:: ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లమ్మి రైతులు లబ్ధిపొందాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాల్ పూర్, రోటిగూడ, పొనకల్, దేవునిగూడ, రేండ్లగూడ, మోర్రిగూడ, కవ్వాల గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేరువేరుగా ఎమ్మెల్యే టెంకాయలు కొట్టి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. సన్నరకం వడ్లను కొనుగోలు కేంద్రంలో అమ్మినట్లయితే రూ.500.00 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతుల శ్రేయస్సే ముఖ్య ఉద్దేశమని ఆయన చెప్పారు.

మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపాన ఐటిఐ పక్కన రూ.20లక్షలతో నిర్మించనున్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ, మండల వ్యవసాయశాఖ అధికారిణి సంగీత, పొనకల్, చింతగూడ పీఏసీఎస్ చైర్మన్లు అల్లం రవి, నాసాని రాజన్న, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజఫర్, మాణిక్యం, పార్టీ సీనియర్ నేతలు మిక్కిలినేని రాజశేఖర్, ఎ.సుభాష్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, కరుణాకర్, ఫని ఉల్లా, సుధీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ఇందయ్య, నందునాయక్, రమేష్, గంగాధర్, అశోక్, హజార్, షాకీర్ ముజ్జు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇటలీ మంత్రిమండలి అధ్యక్షుడిని కలిసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 19భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఈరోజు ఇటలీ రిపబ్లిక్ మంత్రుల మండలి అధ్యక్షుడు హెచ్.ఇ. జార్జియా మెలోని, రియో జనీరోలో జరిగిన జి20 సమ్మిట్ సందర్భంగా. గత రెండేళ్లలో ఇద్దరు ప్రధానుల మధ్య ఇది ఐదో సమావేశం. ఇటలీలోని పుగ్లియాలో ప్రధాన మంత్రి మెలోని అధ్యక్షతన జరిగిన జి 7 సమ్మిట్ సందర్భంగా ఇరువురు నేతలు చివరిసారిగా జూన్ 2024లో కలుసుకున్నారు. ఈ సవాలు సమయాల్లో జి7కి నాయకత్వం వహించినందుకు ప్రధాన మంత్రి మెలోనిని ప్రధాని అభినందించారు.

పుగ్లియాలో వారి చర్చల తరువాత, ఇరువురు నాయకులు భారతదేశం–ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు మరియు రాబోయే ఐదేళ్ల కోసం వారి విజన్‌ను వివరించే జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025–29ని ప్రకటించారు. వాణిజ్యం మరియు పెట్టుబడులు, సైన్స్ మరియు టెక్నాలజీ, కొత్త మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, స్వచ్ఛమైన శక్తి, అంతరిక్షం, రక్షణ, కనెక్టివిటీ మరియు ప్రజల నుండి ప్రజల మధ్య అనుసంధానం వంటి కీలక రంగాలలో ఉమ్మడి సహకారాలు, కార్యక్రమాలు మరియు చొరవలను కార్యాచరణ ప్రణాళిక కొనసాగిస్తుంది.

రెండు వైపులా అనేక డొమైన్‌లలో మంత్రి మరియు అధికారిక సంభాషణలు జరుగుతాయి.

సహ–ఉత్పత్తి, సంబంధిత పరిశ్రమలు మరియు సంస్థల మధ్య సహకారం, ఆవిష్కరణ మరియు చలనశీలత ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ఊపందుకుం టున్నాయి మరియు మరింత లోతును అందిస్తాయి మరియు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు మరియు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి.

ఆయోధ్య యాత్రకు బయలుదేరుతున్న భక్తులకు శివసేన సత్కారం

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ఆయేధ్య యాత్రకు బయలు దేరుతున్న భక్తులందరికీ శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రపు సుదర్శన్,శివసేన యూబిటీ తెలంగాణ రాష్ట్ర ప్రాథనా కార్యదర్శి కావ్య రెడ్డి ఆధ్వర్యం లో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులందరికీ మిఠాయిలు పంచి పెట్టారు కావ్య రెడ్డి నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ వై.అమృత భాజపా సిటీ అధ్యక్షులు గౌతం శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రపు సుదర్శన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.అయేధ్య శ్రీ రామ రాజ్యం పవిత్రమైన ఆలయంలో కళాకారులు భజనలు కీర్తనలు ఆలపించడం జాతి గర్వించదగ్గ విషయం. నల్లకుంట డివిజన్ భజన మండలి అధ్యక్షులు కాపరవేని లింగం బెస్త సంగీత గురువులు పూస నరసిం హ్మ బెస్త భజన్ గానగంధర్వ భజన మండలి కళాకారులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన లోక్ సభ స్పీకర్, పార్లమెంట్ సభ్యులు

న్యూఢిల్లీ, నవంబర్ 19లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా మాజీ ప్రధాని శ్రీమతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరా గాంధీ, సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో, ఆమె జయంతి సందర్భంగా, ఈరోజు.

లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా; లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ; రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ మల్లికార్జున్ ఖర్గే; శ్రీమతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రముఖులు. 19 నవంబర్, 2024న ఆమె జయంతి సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ.

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ; రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ మల్లికార్జున్ ఖర్గే; పార్లమెంట్ సభ్యులు, మాజీ సభ్యులు శ్రీమతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ.

లోక్ సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్ మరియు రాజ్యసభ సెక్రటరీ జనరల్ శ్రీ పి.సి. వోడీ, శ్రీమతికి నివాళులు అర్పించారు. గాంధీ.

శ్రీమతి చిత్రపటం. ఇందిరా గాంధీని 19 నవంబర్ 1987న సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ ఆర్.వెంకటరామన్ ఆవిష్కరించారు.

రేపటి నుంచి అందుబాటులో టీటీడీ క్యాలెండర్లు

తిరుపతి, నవంబర్ 19: టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లను టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు, ఈవో జె. శ్యామల రావు తిరుమల అన్నమయ్య భవనంలో ఆవిష్కరించారు. టీటీడీ స్థానిక ఆలయాలైన తిరుమలలోని భూ వరాహ స్వామి , తిరుపతి సమీపం లోని పేరూరు వకుళమాత ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వ రస్వామి మూర్తులతో కూడిన క్యాలెండర్లను ముద్రించింది.

నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి నాగలాపురం వేద నారాయణస్వామి, కార్వేటినగరం వేణుగోపాలస్వామి, ఒంటిమిట్ట కోదండరామస్వామివారి మూల మూర్తులు, ఉత్సవమూర్తులతో కూడిన క్యాలెండర్లను టీటీడీ ముద్రించింది. ఈ క్యాలెండర్లు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయని అధికారులు వెల్లడించారు .ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి హెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవో వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

తిరుమలలో (తితీబీఎజీశ్రీజీ) భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మొత్తం 31 కంపార్టుమెంట్లకు గాను కేవలం ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ (ఖఆ) అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 62,085 మంది భక్తులు దర్శించుకోగా 21,335 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.78 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

అనాథలకు, అభాగ్యులకు అండగా నిలుద్దాం.. నీలం మధు ముదిరాజ్..

మెదక్, నవంబర్ 19: అనాథలకు, అభాగ్యులకు, మానసిక రోగులకు అండగా నిలబడి సంపూర్ణ సహకారం అందిద్దామని మెదక్ కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలా పూర్ మండల పరిధిలోని నాదర్ గుల్ గ్రామ పరిధిలో గట్టు గిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృదేవోభవ ఆనాథశ్రమంలో మానసిక రోగికి పునర్జన్మ ఇచ్చి ఆశ్రయం కల్పించే కార్యక్రమంలో నీలం మధు పాల్గొన్నారు.

అంతకుముందు ఆశ్రమ ఆవరణలో ఉన్న శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడుతున్న అభాగ్యులతో పాటు ఆనాథలకు అండగా నిలబడి చేరదీస్తున్న మాతృదేవోభవ అనాథాశ్రమ సేవలను ఆయన కొనియాడారు. నా వంతుగా వారికి సంపూర్ణ సహకారాలను అందిస్తానన్నారు. సామాజిక సేవలో పాల్గొంటున్న ప్రతిఒక్కరూ ఇలాంటి సంస్థలకు చేయుతానందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశ్రమం లో 135 మందికి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం మల్లేష్, భరత్, శ్రీధర్, బాలు, ఆశ్రమం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.ప్రపంచ ఉక్కు మహిళగా పేరుగాంచిన ధీశాలి స్వర్గీయ ఇందిరా గాంధీ.. ప్రపంచ దేశాల్లో ఉక్కు మహి ళగా మాత్రమే కాకుండా తన పాలన దక్షతతో పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని మెదక్ కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకొని చిట్కూల్ లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో పేదలకు ఆమె అందించిన సంక్షేమాన్ని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెల్లో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్య , వృద్ధిని అందిస్తుందని స్పష్టం చేశారు. మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభి పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్య , వృద్ధిని అందిస్తుందని స్పష్టం చేశారు.

రూ.500 కోట్ల ఖర్చుతో నాపై తప్పుడు ప్రచారం.. బీజేపీపై జార్ఖండ్ సీఎం మండిపాటు

న్యూఢిల్లీ, నవంబర్ 19 తనపై అసత్య ప్రచారం చేసేందుకు బీజేపీ భారీ మొత్తంలో డబ్బులు ఖర్చు పెడుతోందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజల్లో విద్వేషాన్ని రగిల్చేందుకు బీజేపీ తీవ్రంగా యత్నిస్తోందని అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాజపా తనపై చేసిన ఆరోపణలపై సీఎం 'ఎక్స్' (ట్వీటర్) వేదికగా స్పందించారు.

ప్రజల్లో తనపై విద్వేషాన్ని వ్యాప్తి చేయడం కోసం కాషాయ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని, అందుకు రూ.500 కోట్లు ఖర్చు చేస్తోందని సోరెన్ ఆరోపించారు. ప్రజల మధ్య ద్వేషాన్ని రగిల్చి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడంలో బీజేపీ దిట్ట అని, తన ప్రభుత్వం గురించి బూటకపు ప్రచారం చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసి 9 వేలకు పైగా వాట్సప్ గ్రూప్‌లను సృష్టించిందని విమర్శించారు.

కానీ, తాను జార్ఖండ్‌కు చెందిన బిడ్డనని, ఈ గడ్డపై అలాంటి సంస్కృతికి తావు లేదని, తాను అలాంటి పనులు ఎప్పటికీ చేయలేనని హేమంత్ సోరెన్ పేర్కొన్నారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్ నుంచి బీజేపీ కొందరిని ప్రచారానికి తీసుకొచ్చిందని, వారితో తనకు వ్యతిరేకంగా మాట్లాడించిందని, ఓటర్లను అయోమయానికి గురిచేసేందుకు ప్రయత్నించిందని ఆయన చెప్పారు. ఇవన్నీ బీజేపీ జిమ్మిక్కులని విమర్శించారు.

కాగా, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఇప్పటికే ముగిసింది. మొత్తం 81 స్థానాలు ఉండగా తొలివిడతలో 43 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మిగతా 38 సీట్లకు ఈ నెల 20న పోలింగ్ నిర్వహించనున్నారు.

లగచర్ల ఘటనపై ఎన్ హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు చేసిన ఎంపీ ఈటల రాజేందర్.

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రైతులను పోలీసు కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని..ఇప్పటికీ పోలీసులు, అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని జాతీయ మానవ హక్కుల కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఎన్ హెచ్ ఆర్ సి బృందాలను లగచర్లకు పంపించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. కమిషన్ కూడా సానుకూలంగా స్పందించిందని ఈటల రాజేందర్ తెలిపారు.

కౌన్సిలర్ ఇంట్లో భారీ చోరీ.. మాజీ మంత్రి పరామర్శ

-ఢిల్లీ నుండి నేరుగా శంకర్ పల్లికి వచ్చిన సబితా ఇంద్రారెడ్డి

-డీసీపీ శ్రీనివాస్ తో ఫోన్ లో మాట్లాడిన సబితమ్మ



హైదరాబాద్, నవంబర్ 19: శంకర్ పల్లి మున్సిపల్ కౌన్సిలర్ పార్శీ రాధ బాలకృష్ణ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగిన నేపథ్యంలో మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం వారిని పరామర్శించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి సుమారు 11గంటల సమయంలో ఇంట్లో కూతురి పెళ్లి సందర్భంగా మెహందీ ఫంక్షన్ అనంతరం బంగారం పెట్టడానికి వెళ్లగా.. అందులో ఉన్న సుమారు రెండు కిలోల బంగారం, 80తులాల వెండి ఆభరణాలు, రెండున్నర లక్షల రూపాయల నగదు చోరీకి గురైందని రాధ బాలకృష్ణలు సబితా ఇంద్రారెడ్డికి వివరించారు.

హడావుడిలో 133తులాలు చోరీకి గురైనట్లు తెలిపారని, మొత్తం రెండు కిలోల వరకు బంగారం అపహరణకు గురైందని తెలిపారు. వారి నుండి వివరాలు పూర్తిగా తెలుసుకొని డీసీపీ శ్రీనివాస్ తో సబితా ఇంద్రారెడ్డి ఫోన్ లో మాట్లాడారు. ఈ చోరీని ప్రత్యేక కేసుగా పరిగణించి, బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

బాలకృష్ణ కుటుంబం ఈ సంఘటనతో పూర్తిగా దుఃఖంలో మునిగిందని, పెళ్లి సమయంలో జరిగిన చోరీతో సర్వత్రా ఆందోళన నెలకొందన్నారు. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి కేసును ఛేదించాలని సూచించారు. పార్శీ రాధ బాలకృష్ణ కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. పెళ్లి కూతురుతో సహా బాలకృష్ణ తల్లిదండ్రులు పార్శీ సుదర్శన్ దంపతులను సబితమ్మ ఓదార్చారు. పెళ్లి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా.. రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 19: సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటి.. కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా.. లేక లగచర్ల.. చైనా సరిహద్దుల్లో ఉన్న కల్లోలిత ప్రాంతమా.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లకు వెళ్తున్న మహిళా సంఘాల నేతలపై పోలీసులు దౌర్జన్యం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ప్రజా సంఘాలకు చెందిన మహిళా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

లగచర్లలో అర్ధరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదు.. పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా.. అని కేటీఆర్ మండిపడ్డారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది.. వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తోంది.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. కొడంగల్‌కు వెళ్లే అన్ని దారుల్లో పోలీసుల పహరా ఏర్పాటుచేశారని కేటీఆర్ తెలిపారు. మీరెంత దాచే ప్రయత్నం చేసినా నిజం దాగదు.. ఇప్పటికే లగచర్లలో కాంగ్రెస్ సర్కారు కిరాతకం ఢిల్లీకి చేరింది. దేశ రాజధానిలో మీ అరాచకపర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతోంది. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను అడ్డుకోవడం అంటేనే.. కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి. లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి.. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెలంగాణలోని మౌలాలి, ఏపీలోని మచిలీపట్నం శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేరళలోని పతినంతిట్ట జిల్లాలో కొలువైన శబరిగిరుల్లో కొలువైన అయ్యప్ప దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు తరలివెళ్తుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు దర్శనానికి వెళ్తారు. ఈ క్రమంలో అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్ చెప్పింది. ఏపీ, తెలంగాణ నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. తెలంగాణలోని మౌలాలి, ఏపీలోని మచిలీపట్నం నుంచి కేరళలోని కొల్లం వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని చెప్పింది. మౌలాలి ? కొల్లం (07143) స్పెషల్ రైలు నవంబర్ 22, 29 తేదీల్లో నడుస్తాయని తెలిపింది. శుక్రవారాల్లో ఉదయం 11.30 గంటలకు మౌలాలి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7 గంటలకు కోల్లం చేరుతుంది. ఇక కొల్లం ? మౌలాలి ((07143) మధ్య నవంబర్ 24, డిసెంబర్ ఒకటి తేదీల్లో తెల్లవారు జామున 2.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 10 గంటలకు మౌలాలి స్టేషన్‌కి చేరుకుంటుంది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ అందుబాటులో ఉన్నాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. రైలు చర్లపల్లి, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గుడూరు, రేణిగుంట, కాట్పాడి, సేలం, ఈ-రోడ్, తిరుపూర్, కొయంబత్తూరు, పాలక్కడ్, త్రిసూర్, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చంగనస్సేరి, చెంగనూరు, కాయన్కులం స్టేషన్లలో ఆగుతుందని చెప్పింది. ఇక మచిలీపట్నం - కొల్లాం స్పెషల్ (07145) ట్రైన్ ఈ నెల 25న సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి మంగళవారం రాత్రి 9.20 గంటలకు కొల్లానికి చేరుతుంది. కొల్లాం- మచిలీపట్నం మధ్య (07146) ఈ నెల 20, 27 అందుబాటులో ఉండనున్నది. బుధవారం వేకువ జామున 2.30 గంటలకు కొల్లం నుంచి బయలుదేరి గురువారం ఉదయం 10 గంటలకు మంచిలీపట్నం చేరుతుంది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. రైలు రెండుమార్గాల్లో పెడన, గుడివాడ, విజయవాడ, న్యూ గుంటూరు తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గుడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్పేట్టై, సేలం, ఈ-రోడ్, కొయంబత్తూరు, పాలక్కడ్, ఎర్నాకుళం టౌన్, ఎట్టుమనూరు, కొట్టాయం, చంగనస్సేరి, తిరువల్ల, చెంగనూరు, కాయంకులం స్టేషన్లలో ఆగుతాయని వివరించింది

సమాజం స్థితిగతులు మారిపోయాయి.. మీడియా బాధ్యత పెరిగింది

-జర్నలిస్టు నిష్పక్షపాతంగా ఉంటూ తన విధులను నిర్వర్తించడం చాలా కష్టంగ మారింది

-మీడియా ప్రతినిధులు తప్పుదోవ పట్టించే వార్తలను ప్రసారం చేయకుండా నిరోధించాలి

-"ఆదర్శ రత్న" పత్రిక సంపాదకులు పి.వి. నరసింహారావుకు 'రాష్ట్రీయ సాంబాదిక గౌరవ్ సమ్మాన్ - 2024 అవార్డ్ ను ప్రదానం చేసిన ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్

భువనేశ్వర్, నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్); నేషనల్ ప్రెస్ డేను పురస్కరించుకుని నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు, (ఎన్‌జెడబ్ల్యుబి) దూరదర్శన్ కేంద్రం, ఎఐఆర్, రీజనల్ ఔట్‌రీచ్ బోర్డ్, ఫీల్డ్ ఔట్రీచ్ బోర్డ్, అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్ ముఖ్య అతిథిగా విచేసి జర్నలిజం ఉ మీడియా డెవలప్‌మెంట్ రంగంలో అత్యుత్తమ సహకారం అందించిన అంధర్ గ్రేడ్ కు చెందిన "ఆదర్శ రత్న" పత్రిక సంపాదకులు పాటి వెంకట నరసింహారావుకు 'రాష్ట్రీయ సాంబాదిక గౌరవ్ సమ్మాన్ - 2024 అవార్డ్ ను ప్రదానం చేశారు. ఆయన తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు జర్నలిస్ట్ లకు కుడా అవార్డులు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఈ డిజిటలైజేషన్ యుగంలో జర్నలిస్టుల వృత్తి మారిందని, అయితే వృత్తి ప్రాథమిక లక్ష్యం అలాగే ఉందని గవర్నర్ అన్నారు. మీడియా సమాజాన్ని పటిష్టం చేస్తుందని, ప్రజాభిప్రాయాన్ని ఏర్పరుస్తుందని, పాలనా యంత్రాంగం స్పందించేలా చేస్తుందన్నారు. కానీ నేడు సమాజం స్థితిగతులు మారిపోయాయి, మీడియా బాధ్యత పెరిగింది. అటువంటి పరిస్థితిలో జర్నలిస్టు నిష్పక్షపాతంగా ఉంటూ తన విధులను నిర్వర్తించడం చాలా కష్టం. అయినప్పటికీ మీడియా ప్రతినిధులు తప్పుదోవ పట్టించే వార్తలను ప్రసారం చేయకుండా

నిరోధించాలని ఆయన అన్నారు. స్వాతంత్ర్య పోరాటం, ఎమర్జెన్సీ సమయంలో జర్నలిస్టులు నిర్భయంగా వార్తలను ప్రసారం చేసిన తీరును ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి వివరించారు. భువనేశ్వర్‌లో సాంబాదిక భవన్ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతామన్నారు. ఎన్‌జేడబ్ల్యూబీ అధ్యక్షుడు పదోష్ పట్నాయక్ స్వాగతోపన్యాసం చేయగా, జనరల్ సెక్రటరీ సనత్ మిశ్రా మాట్లాడుతూ దేశంలోని జర్నలిస్టుల మధ్య సమన్వయాన్ని కొనసాగించేందుకు ప్రతి రాష్ట్రంలో సాంబాదిక భవన్‌ను నిర్మించాలని, బోర్డు ఉపాధ్యక్షుడు ప్రద్యుమ్న మొహంతి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన సెమినార్‌లో రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేశ్ పూజారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా భావించే మీడియా ఎగ్జిక్యూటివ్, న్యాయవ్యవస్థ, శాసనసభ అనే మూడు స్తంభాల కంటే శక్తివంతమైనదని అన్నారు

అణ్వాయుధ వినియోగంపై కొత్త రూల్‌కు పుతిన్ గ్రీన్‌సిగ్నల్

మాస్కో, నవంబర్ 19: అణ్వాయుధాల వినియోగంపై రూపొందించిన కొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. నూతన అణ్వాయుధ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు ఆయన ఫుల్ పవర్స్ ఇచ్చేశారు. తమ శత్రు దేశానికి మద్దతు ఇచ్చే దేశాల వద్ద సుదీర్ఘ దూరం ప్రయాణించే మిస్సైళ్లు ఉన్నప్పుడు, ఆ దేశంపై అణ్వాయుధంతో దాడి చేసేందుకు తాము కూడా సిద్ధంగా ఉంటామని ఇటీవల రష్యా ఓ కొత్త సిద్ధాంతాన్ని తయారు చేసింది. దాని ప్రకారం ఉక్రెయిన్‌కు సపోర్టు ఇచ్చే దేశాలపై కూడా అటాక్ చేసేందుకు వెనుకాడబోమని రష్యా ఇవాళ్టి ప్రకటనతో స్పష్టం చేసింది.

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించి వెయ్యి రోజులు అయ్యింది. ఈ నేపథ్యంలో పుతిన్ కొత్త ముసాయిదాకు లైన్ క్లియర్ చేస్తూ ఇవాళ ఆదేశాలు ఇచ్చారు. నాటో దేశాలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సెప్టెంబర్‌లో అణ్వాయుధ వినియోగంపై రష్యా కొత్త విధానాన్ని రూపొందించింది. ఏ దేశం కవ్వింపు చర్యకు పాల్పడినా.. ఆ దేశంపై అటాక్ చేసేందుకు వెనుకాడమోమని రష్యా తేల్చి చెప్పింది. సరిహద్దు వద్ద ఎటువంటటి సైనిక నిర్మాణం చేపట్టినా అది కవ్వింపు చర్యే అవుతుందని రష్యా తెలిపింది.

శత్రు దేశాలకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్, మిస్సైళ్లు, డ్రోన్లు, ఆయుధాలు ఏవైనా రష్యా వైమానిక క్షేత్రంలోకి వస్తే, అప్పుడు వాటికి అణ్వాయుధాలతో సమాధానం చెప్పేందుకు ఆ దేశం సిద్ధమైంది. అణ్వాయుధ దాడి చేసేందుకు రష్యా అధ్యక్షుడి అనుమతి తప్పనిసరి. రష్యాలోని సుదూర ప్రాంతాలపై అటాక్ చేసేందుకు ఉక్రెయిన్‌కు ఇటీవల అమెరికా లాంగ్ రేంజ్ మిస్సైళ్లను అప్పగించింది. ఈ నేపథ్యంలో పుతిన్ కొత్త అణ్వాయుధ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు.

ఓఎల్ఎక్స్ వేదికగా నేరాలు

ఆరేండ్లుగా 200 మందికి టోకరా

అరెస్టు చేసిన పంజాగుట్ట పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 19:దేశంలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పట్టా పొందాడు. జల్సాలు, విలాసవంతమైన జీవితం కోసం తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. ఓఎల్ఎక్స్ వేదికగా నేరాలకు పాల్పడ్డాడు. గత ఆరేండ్లుగా పోలీసుల కంట్లో పడకుండా తప్పించుకొని తిరుగుతున్న ఈ అంతర్రాష్ట్ర మోసగాడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ శ్రావణ్ కుమార్ కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తిరుపతిలోని భవానీనగర్‌కు చెందిన ఎం.బాలాజీ నాయుడు అలియాస్ బాలాజీ (35) ఓ ప్రముఖ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ పట్టాను పొందాడు. డబ్బులు సంపాదించేందుకు చెడు మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇందుకు ఓఎల్ఎక్స్‌ను ఉపయోగించుకున్నాడు.

ఎవరైనా ఖరీదైన ఫోన్లను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పెడితే.. విక్రయిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు దారుడిని అడ్డంగా మోసగించి డబ్బులు తన ఖాతాలోకి వేసుకుంటాడు. ఎవరైనా ఓఎల్ఎక్స్‌లో సెల్‌ఫోన్‌ను అమ్మకానికి పెడితే తాను కొనుగోలు చేస్తానని చెబుతాడు. సంప్రదింపులు చేసి ఫోన్‌తో పాటు దానికి సంబంధించిన పత్రాలను కాపీ చేసుకుంటాడు. తాను ఎలాగైనా కొంటున్నాను కదా.. ఓఎల్ఎక్స్‌లో నుంచి డిలీట్ చేయమని చెబుతాడు. విక్రయదారు డిలీట్ చేయగానే ఆ ఫోన్ల వివరాలను తన నంబర్ ద్వారా ఓఎల్ఎక్స్‌లో తక్కువ రేటుకు విక్రయిస్తున్నట్టు వివరాలు పెడుతాడు. ఎవరైనా ఆ ఫోన్లను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తే ఫలానా చోట కలువాలని, తన సోదరుడు వచ్చి ఆ ఫోన్‌ను చూపిస్తాడని, అక్కడ ఫోన్ తీసుకొని డబ్బులు మాత్రం తన అకౌంట్‌కు బదిలీ చేయాలని చెబుతాడు. అలా తన ఖాతాలో డబ్బులు పడగానే ఉడాయిస్తాడు. 2018 నుంచి ఇప్పటి వరకు 200 మందిని మోసం చేసి లక్షలాది రూపాయలు దండుకున్నాడని ఏసీపీ తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లతో పాటు ఏపీలోని తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఈ తరహా నేరాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బెంగళూరు, తిరుపతి, విజయవాడలో అరెస్టు అయ్యాడని, అతడిపై పంజాగుట్ట, మధురానగర్ పీఎస్ పరిధిలో మూడేసి చొప్పున కేసులు ఉన్నాయన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్స్ రిపోర్టింగ్ పోర్టలో 23 సిమ్‌కార్డులను వినియోగించాడని, 138 మంది బాధితులు ఫిర్యాదు చేశారని, వెలుగులోకి రాని వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని ఏసీపీ చెప్పారు. మోసాల ద్వారా సంపాదించిన డబ్బును ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడిగా పెట్టి వాటిని పోగొట్టుకోవడం, సొమ్ము రాగానే జల్సాలు చేయడం అతడి ప్రవృత్తి అని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. సమావేశంలో ఎస్సైలు శివశంకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం అనుచిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందన

హైదరాబాద్, నవంబర్ 19:హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు.

చేతగానోనికి మాటలెక్కువ.. చేవలేనోనికి బూతులెక్కువ అన్నట్లు రేవంత్ రెడ్డి పరిస్థితి ఉందని హరీశ్‌రావు విమర్శించారు.

పదకొండు నెలల పాలనలో ఆయన నోటి నుండి బూతులు తప్ప నీతులు రాలేదు. కాంగ్రెస్ విజయోత్సవ సభ అని పేరు పెట్టుకొని చేసిందేమీ లేక, చెప్పుకోవడానికి ఏమీ లేక ఎప్పటి లాగే పిచ్చి మాటలు వదిలిండు. ఇక నువ్వు ఎంత గింజుకున్నా లాభం లేదు. అశోక్ నగర్ నుంచి లగచర్ల దాకా, రైతుల నుండి లంబాడి బిడ్డల దాకా నువ్వు చేసిన ఘోరాలు సమసిపోవు. తెలంగాణ ప్రజలు మరిచిపోరు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. నువ్వు కేసీఆర్.. కేసీఆర్ అంటూ కేసీఆర్ గారి నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు. కేసీఆర్ గారి వంటి గొప్ప వ్యక్తి జీవితంలో అర్థం కాదు. తొక్కుకుంటూ తొక్కుకుంటూ వచ్చానని గప్పాలు కొడుతున్నవు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులను తొక్కినవు. షార్ట్ కట్‌లో అధికారం చేజిక్కించుకొని ప్రజలను తొక్కుతున్నవు. నీ వదురుబోతు తనంతో రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదు. నీ దుర్భాషను ప్రజల విచక్షణకే వదిలేస్తున్నాం అని హరీశ్‌రావు అన్నారు.

రిజర్వేషన్లు ఖరారు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, నవంబర్ 19: గ్రామంలో ఉన్న ఏ ఒక్క ఇంటిని వదలకుండా కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఉప కులం తప్పకుండా నమోదు చేయాలని మాజీ మంత్రివ శ్రీనివాస్ గౌడ్‌అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా రాంచంద్రాపురం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమ రేటర్లతో కలసి సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నంబర్ లేని ఇండ్లకు, బై నంబర్ వేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమగ్ర కుల గణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషను ఖరారు చేసి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు

జపాన్‌పై ఘన విజయం.. ఫైనల్స్‌కు భారత్ !

న్యూఢిల్లీ, నవంబర్ 19మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2024లో భారత మహిళల జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బీహార్‌లోని రాజ్‌గిర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈరోజు (మంగళవారం) జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 2-0 పాయింట్ల తేడాతో జపాన్‌ను ఓడించి అజేయంగా ఫైనల్స్‌లోకి ప్రవేశించింది.

ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి అర్ధభాగంలో ఇరు జట్లు ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయాయి. దీంతో 0-0తో ద్వితీయార్థంలోకి అడుగుపెట్టిన రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కాగా, ద్వితీయార్థంలో భారత జట్టు రెండు గోల్స్ చేసి ఆధిక్యం సాధించింది. మ్యాచ్ 48వ నిమిషంలో నవనీత్ గోల్ చేయగా? ఎనిమిది నిమిషాల తర్వాత, 56? లాల్‌రెమ్సియామి భారత్‌కు మరో గోల్ అందించింది. దీంతో భారత మహిళల జట్టు జపాన్ పై 2?0తో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది.

మరో సెమీఫైనల్‌లో మలేషియా ? చైనా తలపడగా.. చైనా విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. కాగా, ఈ నెల 20న జరిగే ఫైనల్లో భారత్ మరోసారి చైనాతో ఢీ కోననుంది.

విజయోత్సవం కాదది.. విఫలోత్సవం : కాంగ్రెస్ ఏడాదిపాలనపై శంభీపూర్ రాజు

హైదరాబాద్, నవంబర్ 19:కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా విధ్వంసమే తప్పితే అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్‌లోపార్టీ సీనియర్ నేత ఎర్రబెల్లి సతీష్‌రావు ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతృప్తికరంగా లేరని పేర్కొన్నారు. ఏడాది పాలనపై కాంగ్రెస్ జరుకుంటున్నది విజయోత్సవం కాదని, సంవత్సరీకమని దుయ్యబట్టారు. నియోజకవర్గ పార్టీ శ్రేణుల కఠోర శ్రమతో ఎమ్మెల్యేగా గెలిచిన అరెకపూడి గాంధీ పార్టీ మారి తీవ్రమైన మోసం చేసారని తక్షణమే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కేవలం బీఆర్ఎస్, పార్టీ శ్రేణులను తిట్టడమే పనిగా పెట్టుకున్నదన్నారు. గాంధీ పేరు పెట్టుకుని గాడ్సెలాగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం నేర్పిస్తామన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో నాయకులే కాంగ్రెస్‌లో చేరారని, బీఆర్ఎస్ శ్రేణులు ఎవరూ పార్టీ మారలేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, జూపల్లి సత్యనారాయణ , జగన్, మంత్రి సత్యనారాయణ సహా పార్టీ నేతలు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న శ్రీ శృంగేరి శారదా పీఠం అధిపతి విధుశేఖర భారతి స్వామిజీ..

అమరావతి, నవంబర్ 19: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అత్యంత ప్రాచుర్యం పొందిన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనం చేసుకున్నారు శ్రీశ్రీశ్రీ జగద్గురువులు శ్రీ శృంగేరి శారదా పీఠం శంకరాచార్య విధుశేఖర భారతి స్వామిజీ. అంతకు ముందు ఆలయ ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి, మల్లేశ్వర స్వామి వారికి స్వామిజీ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మహా మండపం 7వ అంతస్తులో ఉన్న కళా వేదిక వద్ద భక్తులకు స్వామిజీ అనుగ్రహ సంభాషణ చేశారు.

విషాదం.. గుండెపోటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి?

ఖమ్మం, నవంబర్ 19 : ఖమ్మం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గెండెపోటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన ఖమ్మంలోని ఎంవీపాలెంలో చోటు చేసుకుంది. అప్పటివరకు సరదాగా ఆడుకున్న చిన్నారి ప్రహర్షిక (4) ఒక్కసారిగా కుప్పకూలింది.

నిన్న తల్లి లావణ్య గ్రూప్-3 ఎగ్జామ్స్ రాసి ఇంటికి రాగా ప్రహర్షిక పరిగెత్తుకుంటూ వెళ్లి కిందపడింది. ఏమైందని తల్లి అడగ్గా ఛాతిలో నొప్పివస్తోందని చెప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. వెంటనే పాపను తల్లిదండ్రులు తొలుత ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు.

ఆ తర్వాత ఖమ్మంకు తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి చనిపోయిందని వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ప్రహర్షిక మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రేణుకమాత ఎల్లమ్మ సిద్ధోగంకు హాజరైన చల్మెడ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం మల్లారం రేణుకా మాత ఎల్లమ్మ సిద్ధోగం వేడుకకు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి మల్లారం గ్రామస్తులు, గౌడ కులస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపి గౌడ కులనస్తులతో ముచ్చటించారు. అనం తరం చల్మెడ గారు మాట్లా డుతూ ప్రతి 5సంవత్సరాలకు ఒకసారి గౌడ కులస్తులందరూ తమ సిద్ధోగం వేడుకలు జరుపుకుంటారని తెలిపారు. ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆయన అన్నారు. ఈ వేడుకలో మండల అధ్యక్షుడు గోసుకుల రవి, నాయకులు గడ్డం హనుమాన్లు శ్రీకాంత్ గౌడ్, తీగల దేవరాజు, దశరథ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శ్రవణ్, హరీష్, అంజయ్య, మేకల ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో ఎంఈఓ బన్నాజీ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): గంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను వేములవాడ అర్బన్ ఎంఈఓ బన్నాజీ పాంశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పిల్లలకు అమూల్యమైన సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి జ్యోతి, సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్, నగేష్, ఉపాధ్యాయ బృందం,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన మరుగుదొడ్లను నిర్మించండి మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడండి

– ప్రజలను ఆరోగ్యంగా ఉంచడానికి మరుగుదొడ్లు దోహదం చేస్తాయి. అదనపు కలెక్టర్
–100 శాతం మరుగుదొడ్లు నిర్మించి, ఆదర్శవంతమైన గ్రామం గూడెం గడ్డ గ్రామం
–నర్సాపూర్ నియోజకవర్గంలోని గూడెం గడ్డ గ్రామంలో జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం లో పాల్గొన్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, నవంబర్ 19: (మహిళలు ఆత్మగౌరవంగా ఉండాలంటే మరుగుదొడ్లు తప్పనిసరి అని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం నరసాపూర్ నియోజకవర్గంలోని గుడెం గడ్డ గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత ఎంపీడీవో మధులతతో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ మోడల్ టాయిలెట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో గూడెం గడ్డ గ్రామం నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకుని ఉపయోగిస్తూ పర్యావరణాన్ని పారిశుద్ధ్యాన్ని నిర్మూలిస్తూ ఆదర్శవంతంగా నిలవడం అభినందనీయమని అన్నారు. మహిళలు ఆత్మ గౌరవం కాపాడడంలో మరుగుదొడ్ల ప్రధాన పాత్ర వహిస్తాయని చెప్పారు. అనంతరం మరుగుదొడ్లను ఉపయోగించండి, పరిసరాలను పారిశుద్ధ్య నుండి కాపాడండి అనే నినాదాలతో ర్యాలీగా గ్రామంలో పర్యటించిన జరిగింది. గూడెం గడ్డ గ్రామం ప్లాస్టిక్ రహిత గ్రామంగా ముందుకు పోతుందని చెప్పారు ఈ గ్రామంలో సంబంధిత ఎంపీడీవో ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ స్టీల్ బ్యాంక్ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే ప్రతి ఒక్కరూ భోజనానికి స్టీల్ ప్లేట్లు, నీరు సేవించడానికి స్టీల్ గ్లాసులు ఉపయోగించాలని, ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని చెప్పడమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. గూడెం గడ్డ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో మండల అభివృద్ధి అధికారి పాత్ర అభినందనీయమని కొనియాడారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధించడంలో భాగంగా గ్రామాల్లోని ప్రజలందరికీ జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు తడి చెత్త పొడి చెత్త వేరుచేసి మున్సిపాలిటీ ద్వారా చెత్త బండ్లకు అందించడంలో భాగంగా ప్లాస్టిక్ బుట్టలను అందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు., ప్లాస్టిక్ ప్రపంచ టాయిలెట్ దినోత్సవం చరిత్రప్రపంచ పారిశుద్ధ్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి మరియు అందరికీ శుభ్రమైన మరియు సురక్షితమైన మరుగుదొడ్ల ప్రాప్యతను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి 2013లో ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని స్థాపించిందన్నారు. ఇది పారిశుద్ధ్యం మరియు సురక్షితమైన త్రాగునీటి ప్రాథమిక మానవ హక్కును గుర్తు చేస్తుంది. అని తెలిపారు., ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతోంది, వివిధ సంస్థలు, ప్రభుత్వాలు మరియు సంఘాలు మెరుగైన పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత పద్ధతుల కోసం చేస్తున్నాయన్నారు. మంచి పరిశుభ్రతను పాటించండి: వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి సరైన చేతులు కడుక్కోవడం మరియు పరిశుభ్రత పద్ధతులను ప్రోత్సహించండి.

విద్యార్థుల కెరీర్ మార్గాలపైనే దృష్టి

హైదరాబాద్, నవంబర్ 19: విద్యార్థుల కెరీర్ మార్గాలపైనే దృష్టి పెట్టామని వరల్డ్ యూనివర్శిటీ ఆఫ్ డిజైన్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సంజయ్ గుప్తా తెలిపారు. హైదరాబాదులోని కామిక్ కాన్లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ఒక ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్లో యానిమేషన్, గేమ్ డిజైన్ ప్రాజెక్టుల ద్వారా ప్రాచీన భారతీయ పురాణాలు, ఫ్యూచరిస్టిక్ రాజ్యాలు, జానపద కథలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్కు విచ్చేసిన సందర్శకులు పాత్ర డిజైన్లు, వర్చువల్ రియాలిటీ (వీఆర్) అనుభవాలు, గేమ్ డెవలప్మెంట్ ద్వారా ఆధునిక సాంకేతికత, సృజనాత్మకతతో భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించారని తెలిపారు. భారత్లో ప్రముఖ క్రియేటివ్ విశ్వవిద్యాలయంగా వరల్డ్ యూనివర్శిటీ ఆఫ్ డిజైన్ పేరుగాంచిందన్నారు. యానిమేషన్, గేమ్ డిజైన్ విద్యలో కొత్త ప్రమాణాలను సెట్ చేస్తున్నామని చెప్పారు. నిపుణులు రూపకల్పన చేసిన మా ప్రాక్టికల్ పాఠ్యాంశాలు విద్యార్థులను వీఆర్/ఏఆర్ గేమింగ్లో ఏఐ, రంగు, కాంతి, ధ్వనుల ద్వారా భావోద్వేగ కథనాలను చెప్పే కళ వంటి ఆధునిక సాంకేతికతలు, పద్ధతులలో నిమగ్నం చేస్తుందన్నారు. కామిక్ కాన్ ఇండియా మా విద్యార్థుల నైపుణ్యాలను ప్రదర్శించడానికి మా విశ్వవిద్యాలయ నిబద్ధతను చాటడానికి సరైన వేదిక అన్నారు. మా యానిమేషన్, గేమ్ డిజైన్ ప్రోగ్రాం భారతదేశంలో మొదటిదిగా నిలిచిన ప్రోగ్రామ్ అన్నారు. పరిశ్రమకు అనుకూలమైన శిక్షణపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఇది డిజిటల్ వినోద భవిష్యత్తుకు విద్యార్థులను సిద్ధం చేస్తుందన్నారు.

విజయవంతంగా సమగ్ర కుటుంబ సర్వే.. 12 రోజుల్లో 65.02శాతం !

హైదరాబాద్, నవంబర్ 19:తెలంగాణ ప్రభుత్వం ఇంటింటి కుల సర్వేను వియవంతంగా పూర్తి చేస్తోంది. 12 రోజుల్లో ఈ సర్వే 65.02 శాతానికి చేరింది. 1,16, 14,349 నివాసాల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా, 75,75,647 నివాసాల్లో పూర్తయింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి సమగ్ర కుటుంబ సర్వే శరవేగంగా నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల సహకారలేమి ఇబ్బందులకు గురి చేస్తోంది.

కాగా, జిల్లాల వారిగా సర్వేలో ములుగు జిల్లా 95.03 శాతం పూర్తి చేసుకొని ముందంజలో ఉంది. ఆ తర్వాత 89.1 శాతం పూర్తిచేసుకుని నల్గొండ రెండవ స్థానంలో ఉంది. తర్వాత వరుసగా జనగామ, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలు ఉన్నాయి. ఇక హైదరాబాద్ లో కేవలం 44.3 శాతం సర్వే మాత్రమే పూర్తి చేసినట్టు అధికారులు వెల్లడించారు. జనసాంద్రత ఎక్కువగా ఉండటం వలన సిటీలో సర్వే నెమ్మదిగా సాగుతున్నట్టు తెలిపారు.

గొప్పలు చెప్పుకోవడంలో హస్తం పార్టీ ఆరితేరింది

-ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 19 కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది.. కానీ గొప్పలు చెప్పుకోవడంలో హస్తం పార్టీ ఆరితేరిందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని రైతులు తరిమికొట్టేలా ఉన్నారని ఆయన ధ్వజమెత్తారు. హుజుర్నగర్ నియోజకవర్గంలోని పాలకవీడులో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులు చేసిన వ్యాఖ్యలను చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. వడ్ల కొనుగోళ్లలో మిల్లర్లతో మంత్రులు కుమ్మక్కై దోచుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో కనీనం వ్యవసాయం తెలిసిన మంత్రులు ఉంటే అప్పుడు వాళ్ళకి రైతుల బాధ ఏమిటో తెలిసేది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం దిగుబడి తగ్గింది. గాలి లెక్కలు దొంగ లెక్కలతో.. గొప్పగా కొనుగోలు చేశామనే భ్రమలో బతుకుతున్నారు కాంగ్రెస్ మంత్రులు అని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు.

మా ప్రభుత్వంలో దిగుబడి పెరిగింది.. ధాన్యానికి అధిక రేటు వచ్చింది.. ఇప్పుడు కనీసం ధర కూడా ఇవ్వడం లేదు. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో పాటు ధాన్యానికి రేటు కూడా తగ్గి రైతులు తీవ్రంగా అప్పులు పాలవుతున్నారు. రోజుకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు ప్రజలకు తెలపాలి.. అప్పుడు కాంగ్రెస్ బాగోతం బయటపడుతుందన్నారు.

ఎవరెన్ని చెప్పినా కాళేశ్వరం ప్రాజెక్టు మహా అద్భుతం. బాహుబలి మోటర్లు ఆన్ చేసిన తర్వాతనే ప్రాజెక్టు కింద వంట పొలాలకు నీరు అందింది. ఆ విషయం రైతులకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు కాదు.. అపజయోత్సవాలు చేసుకోవాలి.. కాంగ్రెస్ అంటేనే గ్రామాల్లో తరిమికొట్టేలా వున్నారు రైతులు అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థికి పాముకాటు.. ఆందోళనలో తల్లిదండ్రులు

నల్లగొండ, నవంబర్ 19 కేతేపల్లి మండల పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థికి పాముకాటుకు గురయ్యాడు. అప్రమత్తమైన స్కూల్ సిబ్బంది.. బాధిత విద్యార్థిని నకిరేకల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆ విద్యార్థికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే 24 గంటలు గడిస్తే గాని ఏం చెప్పలేం అని వైద్యులు పేర్కొన్నారు. దీంతో బాధితుడి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థి గణేశ్ ఏడో తరగతి చదువుతున్నాడు.

స్కూల్ పరిసర ప్రాంతాల్లో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇటీవలే ప్రిన్సిపల్కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఏం చేయాలో తమకు తెలుసని ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. ఇవాళ్టి ఘటనతో మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రిన్సిపల్పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

హైదరాబాద్, నవంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్డబ్ల్యూ తదితర అన్ని కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచిం చారు. రూ.500 అపరాధ రుసుముతో 23వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osma nia.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి ఘన నివాళి



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మహంకాళి చౌరస్తా వద్ద వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంఛార్జి కేకె మహేందర్ రెడ్డి హాజరై, ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలు అర్పించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూఇందిరా గాంధీ ఆశయ సాధనకు పాటుపడ్డామని, నేటి తరానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను చెబుతూ వారి స్ఫూర్తితో ముందుకు పోతున్నావన్నారు.

ఇండియా అంటేనే ఇందిరా అనే విధంగా వారు పరిపాలన చేశారని, దేశంలోని పేద ప్రజల కోసం గరీబీ హటావో అనే నినాదం,కూడు, గూడు గుడ్డ, బ్యాంకుల జాతీకరణం వంటి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. నాడు వారు దేశంలోని పేద ప్రజలకు భూములను పంచి, అనేక గ్రామాలకు కరెంట్ ను అందించారన్నారు.

వారి చివరి రక్తపు బొట్టు వరకు దేశ సేవే శ్వాసగా బతికారని, ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ పెరు మీద ఇళ్లను ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు వచ్చే సందర్భంగా ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇండ్లను ఇందిరమ్మ పేరు మీద మంజూరు చేయడం జరిగిందని, గుడి చెరువు ఆవరణలో జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలో ఉద్ధరించిందేమీలేదు...

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ దే..
ప్రజలకు అండగా ఉంటాం.. ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి ఉద్యమిస్తాం...
–బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

కరీంనగర్, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఉద్ధరించిందేమీ లేదని, ఏదో ఘనకార్యం చేసినట్టు, రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్దెర ముచ్చట్లు చెప్పుకోవడానికి సిగ్గుండాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. మంగళవారం రోజున కరీంనగర్ లోని బిజెపి జిల్లా శాఖ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడానికి , ప్రజలకు అండగా నిలవడానికి బిజెపి శ్రేణులందరూ సమాయత్తం కావాలన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు , డిక్లరేషన్లు ఏమయ్యాయని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలని ఏ ఒక్క గ్యారెంటీ ని కూడా పూర్తిస్థాయిలో సక్రమంగా అమలు చేయలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఏడాది పాలన తో ఏ ప్రజానీకానికి మేలు జరగలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందన్నారు. అధికారం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ రోజుకో నాటకంఆడుతుందన్నారు .మొదట్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపి కేసుల పేరిట రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ సర్కార్ ఆ అంశాలను వక్కదారి పట్టించిందన్నారు. ఆ తర్వాత డ్రగ్స్, హైడ్రా లాంటి అంశాలను తెరపైకి తెచ్చిందని, నేడు కులగనన సర్వే పేరిట రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం పనిచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు ఆ విషయాన్ని మరిచిందన్నారు. ప్రజా పాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించిందే తప్ప ప్రజలకు కాంగ్రెస్ చేసింది ఏమీ లేదన్నారు. , ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ తీరును ఎండ గట్టి, ప్రజలందరికీ న్యాయం జరిగే వరకు బిజెపి తగిన పోరాటాలు చేస్తుందనీ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యురాలు బోడిగ శోభ, మాజీ జిల్లా అధ్యక్షులు భాగసత్యనారాయణ రావు, మాజీ మేయర్ డి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, గుగ్గిల రమేష్ , ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి , బూట్ల రాజేంద్రప్రసాద్, కొరటాల శివరామయ్య, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, రంగు భాస్కరాచారి, గుర్రాలవెంకటరెడ్డి, ఎర్రబెల్లి సంపత్ రావు, పుప్పాల రఘు , దండు కొమరయ్య, కరివేద మహిపాల్ రెడ్డి , నరసింహా చారి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, శ్రవణ్ , రాజు, ప్రవీణ్ రెడ్డి లతోపాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్య కట్టడికి కృత్రిమ వర్షమే ఏకైక పరిష్కారం.. అనుమతివ్వండి.. కేంద్రానికి ఢిల్లీ మంత్రి లేఖ

న్యూఢిల్లీ, నవంబర్ 19 దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీ ఎన్సీఆర్లో గాలి నాణ్యత సూచి 500 మార్క్కు చేరింది. వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు కృత్రిమ వర్షం కురిపించడం ఒక్కటే ఏకైక పరిష్కారమని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు.

రాజధానిలో కృత్రిమ వర్షం కురిపించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోది జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన లేఖ రాశారు. 'ఉత్తర భారతాన్ని పొగ పొరలు కమ్మేశాయి. స్మోగ్ నుంచి విముక్తికి కృత్రిమ వర్షమే ఏకైక పరిష్కారం. ఇది మెడికల్ ఎమర్జెన్సీ. ఈ విషయమై కేంద్ర పర్యావరణ శాఖ మంత్రికి అనేక సార్లు లేఖలు రాశాను. అయినా వారు పట్టించుకోలేదు. కాలుష్య నియంత్రణకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ప్రధాన మంత్రి మోదీ జోక్యం చేసుకోవాలి. వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ఓ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి' అని గోపాల్ రాయ్ డిమాండ్ చేశారు.

ఢిల్లీలో కృత్రిమ వర్షంపై తాను ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్లో లేఖలు రాసినట్లు చెప్పారు. ఇవాళ కూడా నాలుగోసారి లేఖను పంపినప్పటికీ పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ ఈ విషయంపై ఒక్క సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఈ సమస్యకు స్పష్టమైన పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనివక్షంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాజధాని ఢిల్లీలో మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 494గా నమోదైంది. ఈ సీజన్లో ఇదే అత్యధికం. పలు ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ 500 మార్క్ను తాకాయి. ద్వారకలో అత్యల్పంగా 480గా నమోదైంది. సోమవారం కూడా ఢిల్లీలో కాలుష్యం ఇదే స్థాయిలో నమోదైన విషయం తెలిసింది. ఇవాళ వరుసగా రెండో రోజు కూడా దట్టమైన పొగమంచు కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో ప్రజలు కళ్ల మంటలు, దురద, గొంతు నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాజధానిలో విషపూరిత పొగమంచు కారణంగా దృశ్యమానత పడిపోయింది. ముందు వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి. పొగమంచు కారణంగా విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రాజధానికి రాకపోకలు సాగించే కొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఇవాళ ఉదయం దాదాపు 22 రైళ్లు ఆలస్యంగా నడుస్తుండగా.. మరో తొమ్మిది రైళ్లను అధికారులు రద్దు చేశారు.

కృత్రిమ వర్షాన్ని క్లౌడ్ సీడింగ్ అని కూడా అంటారు. ఈ విధానంతో వెదర్లో మార్పును తీసుకువస్తారు. గాలిలో నీటి బిందువులు ఏర్పడేలా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. సిల్వర్ ఐయోడైడ్, పొటాషియం ఐయోడైడ్ లాంటి పదార్థాలను గాలిలోకి వదులుతారు. దీని కోసం విమానాన్ని కానీ హెలికాప్టర్ను కానీ వాడే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ సక్సెస్ కావాలంటే, ఆ పరీక్ష సమయంలో వాతావరణంలో తేమ చాలా అవసరం అవుతుంది. గాలి కూడా అనుకూలంగా ఉంటేనే ఈ ప్రయోగం సక్సెస్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కృత్రిమ వర్షం వల్ల గాలిలో ఉన్న దుమ్ము, ధూళి సెటిల్ అవుతుంది. నీటితో ఆ డస్ట్ కొట్టుకుపోయి.. పర్యావరణం క్లీన్ అవుతుంది.

బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ బంధన్ మ్యూచువల్ ఫండ్ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 19: (నేటినిజం ప్రతినిధి):బంధన్ మ్యూచువల్ ఫండ్ బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ను ప్రారంభించినట్లు ప్రకటించింది, ఇది నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ట్రాక్ చేసే ఓపెన్-ఎండ్ ఇండెక్స్ పథకం. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు నిఫ్టీ 200 విశ్వంలోని 30 అధిక-నాణ్యత గల కంపెనీలకు ప్రావ్యతను అందిస్తుందని బంధన్ ఏ ఏం సి, సి ఈ ఓ, విశాల్ కపూర్ తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వీటిని రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ) డెట్-టు-ఈక్విటీ నిష్పత్తి ప్రతి షేరుకు ఆదాయాలు వంటి కీలక ఆర్థిక కొలమానాల ఆధారంగా ఎంపిక చేస్తారని అని అన్నారు. మార్కెట్ అస్థిరత మధ్య సాపేక్ష స్థిరత్వాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు సహేతుకమైన ఆకర్షణీయమైన ఎంపికగా ఉంచడం ద్వారా స్థితిస్థాపకత వృద్ధి సంభావ్యత రెండింటినీ అందించడం ఈ ఫండ్ లక్ష్యం. కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) సోమవారం, నవంబర్ 18,2024 న ప్రారంభమవుతుంది. శుక్రవారం, నవంబర్ 29,2024 న ముగుస్తుంది. బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్లో లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, అన్లైన్ ప్లాట్ఫారమ్ల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు.బంధన్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రధాన కారణాలను హైలైట్ చేస్తూ, బంధన్ ఏ ఏం సి, సి ఈ ఓ, విశాల్ కపూర్ మాట్లాడుతూ, "ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నందున, స్థితిస్థాపకత స్థిరత్వాన్ని అందించే లార్జ్-క్యాప్, అధిక-నాణ్యత గల స్టాక్ల వైపు పెరుగుతున్న మార్పు ఉందన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.